VELTHURU TELUGU DAILAY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
మంగళవారం 26.05.2026
సంపుటి: 07 సంచిక: 351
పేజీలు: 12 వెల: రూ. 5/
Velthuru Newspaper
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH



## ఇంధన ధరలు పెంపు దేశం కోసం ధర్మం కోసమేనా?

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ
- పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో ప్రజలపై తీవ్ర భారం
- "దేశం కోసం, ధర్మం కోసం" నినాదాలపై కాంగ్రెస్ నేత తీవ్ర విమర్శ
- పేద, మధ్యతరగతి, చిన్న వ్యాపారులు సంక్షోభంలోకి

2

# హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థిక ఊతం

- రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్‌కు ఐఆర్ఎఫ్‌సీ-హెచ్ఎంఆర్ఎల్ ఒప్పందం
- 20 ఏళ్ల కాలపరిమితితో రుణ సౌకర్యం
- త్రైమాసిక చెల్లింపుల విధానంలో అమలు
- ఢిల్లీలో అధికారుల మధ్య ఒప్పంద పత్రాలపై సంతకాలు
- తెలంగాణ సీఎస్ సమక్షంలో కీలక కార్యక్రమం
- మెట్రో యాజమాన్యం పూర్తిగా ప్రభుత్వానికి బదిలీ అయినట్లు వెల్లడి
- పట్టణ రవాణా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎస్
- ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని వ్యాఖ్య

హైదరాబాద్ వెలుతురు మే 25:

హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేసేందుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ)తో హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్ మెట్రోకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలకు కూడా బలమైన ఆర్థిక మద్దతు లభించనుంది.ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు సమక్షంలో అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ రుణ సౌకర్యాన్ని 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో అమలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లాడిన సీఎస్ రామకృష్ణారావు.. హైదరాబాద్ మెట్రో యాజమాన్యంలో 100 శాతం వాటా ఇప్పుడు

..మిగతా2లో



## ఇంధన ధరల భారం.. రైతుల పేరుతో బీజేపీ మోసపూరిత రాజకీయాలు

2

**ప్రతి గింజ కేంద్రం కొనాలి పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి రైతు వ్యతిరేక విధానాలతో బీజేపీ ప్రజలను మోసం చేస్తోంది - మంత్రి పొన్నం ప్రభాకర్**





# ఘనంగా ప్రారంభమైన మహిళా వారోత్సవాలు

- మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు
- మహిళా సంఘాలకు రైసు మిల్లులు, సూపర్ మార్కెట్లు
- భూములు, లోన్లు సమకూరుస్తామన్న సీఎం
- ధన్యవాదాలు తెలిపిన మంత్రి సీతక్క
- రాష్ట్ర వ్యాప్తంగా పనులు పూర్తి అయిన వందకు పైగా మహిళా భవనాల ప్రారంభోత్సవాలు

హైదరాబాద్, వెలుతురు మే 25:

రాష్ట్ర వ్యాప్తంగా మహిళా శక్తిని గౌరవిస్తూ, మహిళల ఆర్థిక స్వావలంబనకు మరింత బలం చేకూర్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు విక్రమార్క, మంత్రులు డా.దనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వారోత్సవాలను ప్రారంభించారు.

..మిగతా2లో



మహిళా వారోత్సవాల సందర్భంగా మంత్రి సీతక్కకు, ఎమ్మెల్యే మట్టా రాగమయికి చీరలు బహూకరించిన సీఎం రేవంత్ రెడ్డి



## ఎన్డీఏ తీరుపై సుప్రీం కోర్ట్ తీవ్ర ఆగ్రహం

- కేంద్రం, సీబీఐలకు సుప్రీంకోర్టు నోటీసులు
- గతాన్ని మరిచిన ఎన్డీఏ – సుప్రీంకోర్టు అసహనం
- కేంద్రం, దర్యాప్తు సంస్థలకు నోటీసులు
- నివేదికకు గురువారం వరకు గడువు
- మానిటరింగ్ కమిటీ సిఫారసుల అమలుపై అఫిడవిట్ దాఖలుకు ఆదేశం
- వైద్య సంఘాల ఆందోళన
- న్యాయం కోసం సుప్రీంకోర్టుకు క్యూ కట్టిన సంస్థలు

2



## ఇంధన ధరల ఉప్పెన

- సామాన్యుడిపై కేంద్రం పన్నుల భారాల వడ్డన
- కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ విమర్శలు
- పాలకుల తీరుపై దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న నిరసనలు
- అంతర్జాతీయ మార్కెట్ సాకులు, దేశీయంగా నిరంతర వడ్డనలు
- ఎన్నికల కాలం నాటి వ్యూహాలు.. ఆ తర్వాతే అసలు అస్త్రాలు

2



## ధాన్యం కొనకపోతే కలెక్టరేట్లు ముట్టడిస్తాం

- రెండు రోజుల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- లేదంటే రైతులతో కలిసి సిద్దిపేటలో ఆందోళనకు
- మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక
- మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్‌లో పనిచేస్తున్న ప్రభుత్వం
- ధాన్యం తరుగుల పేరుతో రైతులను నిలువునా దోచేస్తున్నారు

2

# గోదావరి తీరంలో అభివృద్ధి బాట

- పంచాయతీ వనాలతో సరికొత్త హరిత విప్లవం
- విజ్ఞేశ్వరం టు సిద్ధాంతం ఏటిగట్టు రహదారి
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు
- ప్రతి గ్రామ పంచాయతీలో దేశీయ వనాల ఏర్పాటు
- పర్యావరణ సమతుల్యతతో పాటు స్థానిక గ్రామస్తుల భాగస్వామ్యం

అమరావతి వెలుతురు మే 25:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) పవన్ కళ్యాణ్ సోమవారం ఉమ్మడి గోదావరి జిల్లా పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందిస్తూ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసే 'పంచాయతీ వనం' విధానానికి

..మిగతా 2లో



## తెలంగాణలో తీవ్ర వడగాల్పులు



2

## సామాన్యుడిపై చమురు భారం

- పది రోజుల్లో నాలుగోసారి పెరిగిన ఇంధన ధరలు
- అంతర్జాతీయ సంక్షోభం ఎఫెక్ట్‌తో వంద దాటిన లీటర్ పెట్రోల్
- పది రోజుల వ్యవధిలోనే నాలుగు సార్లు ఇంధన ధరల సవరణ
- దేశ రాజధాని ఢిల్లీతో పాటు మెట్రో నగరాల్లోనూ సెంచరీ దాటిన ఇంధనం
- తెలుగు రాష్ట్రాల్లో రికార్డు స్థాయికి చేరిన చమురు ధరల మంటలు




2

## రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానోత్సవం

- ధర్మేంద్రకు మరణానంతరం పద్మవిభూషణ్
- పురస్కారాన్ని స్వీకరించిన హేమమాలిని
- తెలుగు రాష్ట్రాల నుంచి పలువురికి ప్రతిష్ఠాత్మక గౌరవాలు
- తొలి విడతలో 66 మందికి పురస్కారాల ప్రదానం



2

## తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం

- అన్నాడీఎంకేకు కోలుకోలేని దెబ్బ
- ముగ్గురు తిరుగుబాటు ఎమ్మెల్యేల రాజీనామా
- టీవీకే వైపు అడుగులు వేస్తున్న ముగ్గురు ఎమ్మెల్యేలు
- ద్రావిడ రాజకీయాల్లో అనూహ్య మార్పులు



2

# ధాన్యం కొనకపోతే కలెక్టరేట్లు ముట్టడిస్తాం

సిద్దిపేట వెలుతురు మే 25:

సిద్దిపేట జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే వేలాది మంది రైతులతో కలిసి సిద్దిపేట కలెక్టరేట్ను ముట్టడిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. సిద్దిపేట జిల్లా ఎన్సాన్పల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించిన హరీశ్రావు అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల వద్ద రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను మిషన్ మోడ్లో నిర్వహించడం లేదని, పూర్తిగా కమిషన్ మోడ్లో నడుపుతోందని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, మంత్రులు కేవలం కమీషన్లపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడవకుండా రైతులు రాత్రింబవళ్లు కాపలా కాస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. క్వింటాల్ ధాన్యానికి ఐదు కిలోల వరకు తరుగుల పేరుతో కోత విధిస్తున్నారని హరీశ్రావు మండిపడ్డారు. ఈ తరుగుల కారణంగా రైతులు భారీగా నష్టపోతున్నారని చెప్పారు. రైతుల కష్టార్జిత పంటను ఇలా కోతల పేరుతో దోచుకోవడం దారుణమన్నారు. దీనిపై మంత్రులు, ఉన్నతాధికారులు స్పందించకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా హరీశ్రావు తీవ్ర విమర్శలు చేశారు. సీఎం తరచూ ఢిల్లీ పర్యటనలు చేయడం మానేసి, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల ట్రిప్పులు పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు రోడ్లపై ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మాత్రం ప్రచారాలకే పరిమితమైందన్నారు.

# ఇంధన ధరల ఉప్పెన

ఢిల్లీ వెలుతురు మే 25:

దేశవ్యాప్తంగా నిత్యం మారుతున్న ఇంధన ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఒకవైపు ఆదాయాలు పెరగక, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో సామాన్యుడు బతుకు బండిని లాగలేక తీవ్ర అవస్థలు పడుతున్నాడు. ఇంధన ధరల పెరుగుదల అనేది కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా, రవాణా రంగంపై ప్రభావం చూపిస్తూ మార్కెట్లోని ప్రతి వస్తువు ధర పెరగడానికి ప్రధాన కారణమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగినప్పుడు ఆ భారాన్ని వెనువెంటనే దేశీయ వినియోగదారులపై వేసే చమురు సంస్థలు, అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పుడు మాత్రం ఆ ప్రయోజనాన్ని ప్రజలకు బదిలీ చేయడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా ధరలు తగ్గిన ప్రతిసారీ కేంద్ర ప్రభుత్వం అదనపు ఎక్సైజ్ సుంకాలు, సెస్సుల రూపంలో పన్నులను పెంచుకుంటూ పోవడంతో, సామాన్యుడికి ఎప్పుడూ ఉపశమనం లభించడం లేదు. ఫలితంగా ప్రపంచ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు ఎలా ఉన్నా, దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు నిరంతరం రికార్డు స్థాయిలోనే కొనసాగుతున్నాయి.

# ఇంధన ధరలు పెంపు దేశం కోసం ధర్మం కోసమేనా?

హైదరాబాద్ వెలుతురు మే 25:

పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో దేశ ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్న బీజేపీ ప్రభుత్వం, "దేశం కోసం, ధర్మం కోసం" అనే నినాదాలతో ప్రజలను భావోద్వేగాలకు గురి చేస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ తీవ్రంగా విమర్శించారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు, చిన్న వ్యాపారులు ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడ్డారని ఆయన ఆరోపించారు. నిత్యావసర వస్తువులైన కూరగాయలు, పాలు, బియ్యం వంటి వాటి రవాణా ఖర్చులు పెరగడంతో ద్రవ్యోల్బణం మరింత పెరిగిందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను మల్టీనేషనల్ కంపెనీల చేతుల్లోకి నెట్టివేస్తున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు ఒక విధంగా, తర్వాత మరో విధంగా మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ నేతలు ప్రజలకు ఖర్చులు తగ్గించుకోవాలని సలహాలు ఇస్తున్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం విదేశీ పర్యటనలను వైభవంగా కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు చేసే ప్రయత్నాలు ఇక పనిచేయవని వ్యాఖ్యానించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి వ్యాఖ్యలను తప్పుబడుతూ కాంగ్రెస్ను నిందించడం సరికాదని, ఆర్థిక పరిస్థితులు, రూపాయి విలువ, క్రూడ్ ఆయిల్ ధరలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై కేంద్రం బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇంధన, గ్యాస్ కొరత పరిస్థితులు నెలకొంటున్నాయని, భవిష్యత్తులో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్షాలపై దాడులు చేయడం కేంద్ర ప్రభుత్వ విధానంగా మారిందని ఆరోపించారు. దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలకు కూడా గ్యాస్ సిలిండర్లు అందని పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని విమర్శించారు.

# సామాన్యుడిపై చమురు భారం

ఢిల్లీ వెలుతురు మే 25:

దేశవ్యాప్తంగా చమురు మంటలు సామాన్య, మధ్యతరగతి వినియోగదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రధాన ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపుతూ, దేశీయంగా ఇంధన ధరలను భారీగా పెంచుకుంటూ పోతున్నాయి. కేవలం పది రోజుల వ్యవధిలోనే వరుసగా నాలుగు విడతలుగా ధరలను పెంచడంతో పెట్రోల్, డీజిల్ రేట్లు సరికొత్త రికార్డులను తాకాయి. తాజా సవరణతో లీటరు పెట్రోలుపై 2 రూపాయల 84 పైసలు, డీజిల్ లీటరుపై 2 రూపాయల 86 పైసలు అదనపు భారం పడింది. దీంతో కేవలం పది రోజుల్లోనే పెట్రోలుపై మొత్తం 8 రూపాయల 2 పైసలు, డీజిల్పై 7 రూపాయల 91 పైసల మేర పెరిగినట్లయింది. ఈ ఆకస్మిక పెంపుదలపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ తాజా వడ్డనతో దేశ రాజధాని ఢిల్లీతో పాటు దేశంలోని ప్రధాన మెట్రో నగరాలన్నింటిలోనూ లీటర్ పెట్రోల్ ధర వంద రూపాయల మార్కును దాటేసింది. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో లీటరు పెట్రోలు ధర ఏకంగా 118 రూపాయల మార్కును తాకి వినియోగదారులను బెంబేలెత్తిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు సరఫరాలో తలెత్తిన అడ్డంకులను సాకుగా చూపిస్తూ, చమురు కంపెనీలు మే 14వ తేదీ అర్ధరాత్రి నుంచి ఈ ధరల పెంపు ప్రక్రియకు తొలిసారిగా తెరలేపాయి. ఆ తర్వాత కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే మే 18న రెండోసారి, అనంతరం మే 22న మూడోసారి ధరలను సవరించాయి. తాజాగా ఇవాళ ఉదయం ఆరు గంటల నుంచే అమలులోకి వచ్చేలా నాలుగో విడత భారాన్ని మోపాయి. ఈ భారీ హెచ్చుతగ్గులకు పశ్చిమాసియాలో చోటుచేసుకున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇరాన్ పరిసర ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకోవడానికి ముందుతో పోలిస్తే అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరల్లో తీవ్రమైన అస్థిరత ఏర్పడింది. యుద్ధానికి ముందు ఫిబ్రవరి నెల నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు చాలా వరకు అదుపులోనే ఉండేవి. అప్పట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ప్రతి బారెల్కు సగటున 65 డాలర్ల నుంచి 72 డాలర్ల మధ్య స్థిరంగా కొనసాగేది. ఆపై పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ముదిరి సప్లై చైన్ (సరఫరా వ్యవస్థ) దెబ్బతినే ప్రమాదం వాటిల్లడంతో ముడిచమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి.

# ఎన్టీఏ తీరుపై సుప్రీం కోర్ట్ తీవ్ర ఆగ్రహం

ఢిల్లీ వెలుతురు మే 25:

దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం మరోసారి దేశాన్ని కుదిపేస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక పరీక్ష నిర్వహణలో చోటుచేసుకుంటున్న వరుస లోపాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి, అసహనాన్ని వ్యక్తం చేసింది. గతంలో జరిగిన చారిత్రాత్మక లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతాల నుండి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని, కనీస గుణపాఠాలను కూడా నేర్చుకోలేదని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ వివాదాస్పద అంశంపై దాఖలైన పలు పిటిషన్లను సోమవారం విచారించిన ధర్మాసనం.. అటు కేంద్ర ప్రభుత్వానికి, ఇటు ఎన్టీఏతో పాటు కేసు దర్యాప్తు చేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థకి కీలక నోటీసులు జారీ చేసింది. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న ఇంతటి సున్నితమైన అంశంలో జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేసింది. జస్టిస్ పీఎస్ నరసింహ మరియు జస్టిస్ అలోక్ ఆరాధేతో కూడిన ఉన్నత స్థాయి న్యాయ ధర్మాసనం ఈ కేసును నిశితంగా పరిశీలించింది. గతంలో కోర్టు ఇటువంటి పరీక్షల అక్రమాలు సుప్రీంకోర్టు పరిధిలోకి వచ్చాయని, ఆ సమయంలో కోర్టు జారీ చేసిన దిశానిర్దేశాల అనుగుణంగా ఒక ప్రత్యేక మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. నాటి కమిటీ దేశంలో పరీక్షల నిర్వహణను మెరుగుపరచడానికి సమర్పించిన కీలక సిఫారసులు అసలు అమలుకు నోచుకున్నాయా లేదా అన్న నిజ నిజాలను తేల్చాలని ఎన్టీఏను ఆదేశించింది. ఈ సూచనల అమలు సాధ్యాసాధ్యాలపై పూర్తి స్థాయి వివరాలు, ఆధారాలతో కూడిన అఫిడవిట్ను రాబోయే గురువారం లోపు కోర్టుకు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం గడువు విధించింది. ఎన్టీఏ నిష్పాక్షికతను నిరూపించుకోవడానికి ఇదొక పరీక్షగా నిలిచింది. విచారణ ప్రక్రియలో భాగంగా న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. దేశంలో నిరంతరం ఇటువంటి విద్యా సంక్షోభాలు తలెత్తడం అత్యంత శోచనీయమని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో ఒక నిర్దిష్ట కమిటీ ఏర్పడి, భవిష్యత్తు లీకేజీలను అడ్డుకోవడానికి ఎన్నో అమూల్యమైన సూచనలు చేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఆ సూచనలను తుంగలో తొక్కినట్లు స్పష్టమవుతోందని పేర్కొంది. ఇప్పుడు ఆ సిఫారసుల అమలు తీరుపై దేశ ప్రజలకు, కోర్టుకు పూర్తి స్పష్టత కావాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలోనే ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్, యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ వంటి ప్రతిష్ఠాత్మక వైద్య సంఘాలు విద్యార్థుల పక్షాన నిలిచి సుప్రీంకోర్టు తలుపులు తట్టాయి.

# ఇంధన ధరల భారం.. రైతుల పేరుతో బీజేపీ మోసపూరిత రాజకీయాలు

హైదరాబాద్ వెలుతురు మే 25:

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజల నడ్డి విరుస్తూ, ప్రజల అసలు సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకు "రైతు ఘోస – బీజేపీ భరోసా" పేరుతో బస్సు యాత్రలు చేపట్టడం పూర్తిగా రాజకీయ డ్రామా. నిజంగా తెలంగాణ రైతులపై ప్రేమ ఉంటే ముందుగా పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రోజురోజుకు పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావంతో రైతులపై సాగు వ్యయం భారీగా పెరిగింది. ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా ఖర్చులు అన్నీ పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ రైతు సంక్షేమం గురించి మాట్లాడుతున్న బీజేపీ నేతలు ఈ అంశంపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. కొనుగోలు చేసిన ధాన్యంలో బాయిల్డ్ రైస్ సాంక్షన్ చేయడంలో, లేవీ రైస్కు అనుమతులు ఇవ్వడంలో కేంద్రం సహకరించడం లేదు. తెలంగాణ ప్రభుత్వం మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పదేపదే కోరినా కేంద్రం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోంది. కేంద్ర ప్రభుత్వం కేవలం 53.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలగకుండా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అదనంగా పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా కేంద్రం అనుమతి ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది.

# ఘనంగా ప్రారంభమైన మహిళా వారోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న 8 వేల గ్రామ మహిళా సమాఖ్య భవనాలకు ముఖ్యమంత్రి సచివాలయం నుంచి వర్చువల్గా శంకుస్థాపన చేశారు. సీఎం శంకుస్థాపన అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామస్థులు, మహిళా సమాఖ్య సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి స్థానికంగా శంకుస్థాపనలు నిర్వహించి పనులను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహిళా సంఘాలకు మరిన్ని ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామిక రంగంలోకి తీసుకురావడంలో భాగంగా మహిళల ఆధ్వర్యంలో రైస్ మిల్లుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోందన్నారు. ఇందుకోసం అవసరమైన భూమి, బ్యాంకు రుణాలు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతుందని సీఎం హామీ ఇచ్చారు. అలాగే మహిళల చేత సూపర్ మార్కెట్ల ఏర్పాటు చేయించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందన్నారు. మహిళా సంఘాలకు 30 సంవత్సరాల పాటు ప్రభుత్వ భూములను లీజుకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మహిళలు కేవలం పొదుపు సంఘాలకే పరిమితం కాకుండా వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ముందుకు రావాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. జిల్లాల్లోని మహిళా సమాఖ్య సభ్యులతో సీఎం ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి వ్యాపార అనుభవాలు తెలుసుకుని..వారి ఆర్థిక బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి అనుగుణంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అయితే మహిళా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పనులు పూర్తి అయిన వందకు పైగా మహిళా సమాఖ్య భవనాలను ప్రజా ప్రతినిధులు, మహిళా సమాఖ్య సభ్యులు ప్రారంభోత్సవాలు చేశారు. ఆడబిడ్డలకు కొత్త ఆర్థిక అవకాశాలు కల్పిస్తున్న సీఎం కు కృతజ్ఞతలుమంత్రి సీతక్క ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళల ఆర్థిక సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. గ్రామీణ మహిళల జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావాలనే సంకల్పంతో సీఎం, మంత్రివర్గ సహచరులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు కొత్త ఆర్థిక అవకాశాలు కల్పిస్తూ, వ్యాపారాల్లో ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి, మంత్రివర్గ సహచరులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థిక ఊతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి బదిలీ అయినట్లు తెలిపారు. రాష్ట్రంలో పట్టణ రవాణా వ్యవస్థను మరింత ఆధునికీకరించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక వృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. మెట్రో కనెక్టివిటీ మరింత బలోపేతం అయితే నగరంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని, ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన చెప్పారు. ప్రజా రవాణా వ్యవస్థను సుస్థిరంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రుణాల రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడంలో సహకరించిన భారత ప్రభుత్వం, ఐఆర్ఎఫ్సీ, ఎల్ అండ్ టీ హెచ్ఎంఆర్ఎల్ అధికార బృందాలకు రామకృష్ణారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం వల్ల మెట్రో కార్యకలాపాల నిర్వహణ మరింత సులభతరం కావడంతో పాటు, భవిష్యత్ విస్తరణ ప్రాజెక్టులకు కూడా ఆర్థిక అవకాశాలు పెరుగుతాయని అధికారులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నగర విస్తరణ వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో మెట్రో రైలు సేవల విస్తరణ అత్యంత కీలకమని నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్య కారణంగా ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్న వేళ, మెట్రో రైలు నగర ప్రజలకు సమర్థవంతమైన ప్రత్యామ్నాయ రవాణా వ్యవస్థగా నిలుస్తోందని పేర్కొంటున్నారు. ఈ తాజా ఒప్పందంతో హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం లభించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ఊతం లభించనుంది.

# తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం

చెన్నై వెలుతురు మే 25:

తమిళనాడు రాజకీయ యవనికపై శరవేగంగా మారుతున్న పరిణామాలు తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రంలో దశాబ్దాలుగా చక్రం తిప్పిన ప్రధాన ప్రతిపక్షం ఆలిండియా అన్నా ద్రావిడ మున్నేట్ర కజగం పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా రోడ్డున పడ్డాయి. పార్టీ అధిష్ఠాన విధానాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ముగ్గురు తిరుగుబాటు శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు) తమ పదవులకు ఊహించని విధంగా రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. ఈ పరిణామం అన్నాడీఎంకే ఉనికిని, అంతర్గత బలాన్ని తీవ్రంగా దెబ్బతీసేలా కనిపిస్తోంది. పాత తరం ద్రావిడ పార్టీల ఆధిపత్యానికి గండి కొడుతూ సరికొత్త రాజకీయ శక్తులు పుంజుకుంటున్న తరుణంలో ఈ ముగ్గురు నేతల నిర్ణయం ద్రావిడ రాజకీయాన్ని సరికొత్త మలుపు తిప్పింది. పార్టీలోని సీనియర్ నేతలు సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి నేతృత్వంలో కొనసాగుతున్న అసమ్మతి వర్గానికి చెందిన ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామాకు దారితీసిన పరిణామాలపై కొంతకాలంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. చెన్నైలోని సెక్రటేరియట్ (సచివాలయం) వేదికగా ఈ రోజు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అసమ్మతి గళం వినిపిస్తున్న ప్రజాప్రతినిధులు నేరుగా తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్ను కలిసి తమ అధికారిక రాజీనామా లేఖలను ఒకేసారి సమర్పించారు. స్పీకర్ కూడా నిబంధనల ప్రకారం వీరి రాజీనామాలను పరిశీలించి తదుపరి చర్యలకు ఉపక్రమించడంతో తమిళనాడు శాసనసభలో అన్నాడీఎంకే బలం ఒక్కసారిగా పడిపోయింది. ఈ ఆకస్మిక పరిణామంతో అన్నాడీఎంకే శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి. రాజీనామా అస్త్రం ప్రయోగించిన వారిలో అన్నాడీఎంకే తరఫున గెలిచిన ముగ్గురు కీలక నేతలు ఉన్నారు. మదురాంతకం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మరగాథం కుమార్వేల్, ధారాపురం నియోజకవర్గ శాసనసభ్యురాలు సత్యభామ, అలాగే పెరుందురై నియోజకవర్గం నుంచి ఎన్నికైన జయకుమార్ తమ పదవులను త్యజించారు. ఈ ముగ్గురు నేతలు తమతమ ప్రాంతాల్లో బలమైన క్యాడర్, ప్రజాదరణ ఉన్న నాయకులు కావడం గమనార్హం. పార్టీ అంతర్గత సంక్షోభం మరియు నాయకత్వ లోపాల వల్లే తాము ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఈ తిరుగుబాటు వర్గం అంతర్గత సంభాషణల్లో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల అభివృద్ధి, భవిష్యత్తు రాజకీయాల దృష్ట్యా ఈ నిర్ణయం తప్పలేదని సమాచారం. గతంలో తమిళనాడు అసెంబ్లీ వేదికగా జరిగిన అత్యంత కీలకమైన బలపరీక్ష (విశ్వాస తీర్మానం) సమయంలోనే ఈ ముగ్గురు ఎమ్మెల్యేల భవిష్యత్తు అడుగులు స్పష్టమయ్యాయి. సభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని అన్నాడీఎంకే పార్టీ జారీ చేసిన అధికారిక విప్ను వీరు బాహాటంగానే ధిక్కరించారు. నాడు విప్ను బేఖాతరు చేస్తూ ప్రభుత్వ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన 25 మంది అన్నాడీఎంకే తిరుగుబాటు ఎమ్మెల్యేల జాబితాలో ఈ ముగ్గురు కూడా ప్రముఖంగా ఉన్నారు. నాటి నుంచే వీరిపై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు, అనర్హత వేటు పడే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలోనే అనర్హత వేటు పడకముందే, తామే స్వచ్ఛందంగా పదవులను వదులుకోవడం ద్వారా రాజకీయంగా పైచేయి సాధించాలని వీరు భావించారు. స్పీకర్ ప్రభాకర్కు తమ రాజీనామా పత్రాలను సమర్పించిన కొద్ది నిమిషాల్లోనే ఈ ముగ్గురు నేతలు సచివాలయ ప్రాంగణంలోనే ఉన్న తమిళగ వెట్రి కజగం పార్టీకి చెందిన మంత్రి ఆదవ్ అర్జునతో ప్రత్యేకంగా భేటీ కావడం రాజకీయ వర్గాల్లో మరింత వేడిని రగిల్చింది.

# తెలంగాణలో తీవ్ర వడగాల్పులు

హైదరాబాద్ వెలుతురు మే 25:

తెలంగాణ రాష్ట్రం తీవ్రమైన ఎండలు, వడగాల్పుల ప్రభావంతో నిప్పుల కొలిమిని తలపిస్తోంది. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచే వేడిగాలులు వీచడంతో సాధారణ జీవనం పూర్తిగా స్తంభించిన పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం వేళల్లో పరిస్థితి మరింత తీవ్రమవుతోంది. రాబోయే నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈసారి వడగాల్పుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాతావరణ శాఖ తొలిసారిగా పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడం విశేషంగా మారింది. అత్యంత తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశమున్న జిల్లాల్లో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి ప్రమాదకర స్థాయికి చేరే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. రెడ్ అలర్ట్ జారీ చేసిన ప్రాంతాల్లో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచనలు జారీ అయ్యాయి. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావడం అత్యంత ప్రమాదకరమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు మరియు అనారోగ్యంతో ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# రాష్ట్రపతి భవన్లో ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానోత్సవం

ఢిల్లీ వెలుతురు మే 25:

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం సాయంత్రం వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా కళలు, సాహిత్యం, వైద్యం, క్రీడలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన వారిని ఈ గౌరవాలతో సత్కరించారు. బాలీవుడ్ ప్రముఖ నటుడు ధర్మేంద్రకు మరణానంతరం పద్మవిభూషణ్ పురస్కారం లభించింది. ఆయన తరఫున ఈ అవార్డును ఆయన సతీమణి, పార్లమెంట్ సభ్యురాలు హేమమాలిని స్వీకరించారు. కళారంగంలో విశిష్ట సేవలకు ప్రముఖ వైలినిస్ట్ ఎన్. రాజమ్కు పద్మవిభూషణ్ పురస్కారం అందించారు. ఇతర ప్రముఖ పురస్కార గ్రహీతల్లో ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి భగత్సింగ్ కోశ్యారీ, ప్రముఖ వైద్య నిపుణుడు కల్లిపట్టి రామసామి పళనిస్వామి, ప్రముఖ బ్యాంకింగ్ రంగ వ్యవస్థాపకుడు ఉదయ్ సురేష్ కుమార్ కోటక్, భారత మహిళా క్రికెట్ జట్టు సారథి హర్మన్ ప్రీత్ కౌర్ తదితరులు ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా పలువురు ప్రముఖులు ఈ ప్రతిష్ఠాత్మక గౌరవాలను అందుకున్నారు. వారిలో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్కు మరణానంతరం పురస్కారం లభించగా.. గూడూరు వెంకట్రావు, పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి, వెంపటి కుటుంబ శాస్త్రి, దీపికా రెడ్డి తదితరులు పురస్కారాలను స్వీకరించారు.

# గోదావరి తీరంలో అభివృద్ధి బాట

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకారం చుట్టగా, మరోవైపు ఏళ్లుగా పెండింగ్లో ఉన్న గోదావరి ఏటిగట్టు రహదారి నిర్మాణ ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారానే గ్రామీణ నాగరికత, ఆర్థిక వృద్ధి పరిఢవిల్లుతాయని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాజనగరంలోని ప్రాంతీయ అటవీ అభివృద్ధి పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నర్సరీలలో అత్యంత శాస్త్రీయ పద్ధతుల్లో పెంచుతున్న వివిధ రకాల దేశీయ వృక్ష జాతులను, వాటి ప్రత్యేకతలను అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో దాదాపు 400 రకాల విభిన్న జాతులకు చెందిన రెండు లక్షల యాభై వేలకు పైగా దేశవాళి మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంతరించిపోతున్న దేశీయ వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఈ అరుదైన మొక్కలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామ పంచాయతీకి చేరవేసి, అక్కడ ప్రత్యేక వనాలను (వుడ్ బ్యాంక్స్) ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ బృహత్తర పర్యావరణ సంకల్పాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు గాను పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజకు పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అటవీ శాఖ అధికారులతో సంయుక్తంగా తక్షణమే ప్రత్యేక అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకోవాలని సూచించారు.






# బండారు దత్తాత్రేయ జీవితం ప్రజాసేవకు అంకితం

- **విశాఖలో ఘనంగా 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ**
- **మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో ఘన కార్యక్రమం**
- **ముఖ్య అతిథిగా ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు హాజరు**
- **బీజేపీ కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు: జివిఎల్**
- **రాజకీయాల్లో శత్రువులు లేని నేత దత్తాత్రేయ: గంటా**
- **రాజకీయాల్లో విలువలు రోజురోజుకు పడిపోతున్నాయి: దత్తాత్రేయ**
- **ప్రజల మధ్య నుంచి ఎదిగిన మహోన్నత వ్యక్తి: హరిబాబు**
- **దివిసీమ ఉప్పెన సమయంలో దత్తాత్రేయ సేవలు మరువలేనివి**
- **అలయ్ బలయ్ తరహా కార్యక్రమాలు ఉత్తరాంధ్రలోనూ నిర్వహించాలి**
- **ప్రజాసేవే రాజకీయాల అసలు లక్ష్యం అని వ్యాఖ్యలు**
- **వివిధ రాజకీయ ప్రముఖులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు**

విశాఖపట్నం వెలుతురు మే 25:

విశాఖపట్నంలోని మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత చరిత్ర 'ప్రజల కథే నా ఆత్మ కథ' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాజీ ఎంపీ జివిఎల్ నరసింహారావు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో పాటు బీజేపీ ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జివిఎల్ నరసింహారావు మాట్లాడుతూ బండారు దత్తాత్రేయ వివిధ హోదాల్లో సమర్థంగా పనిచేసి ఆయా పదవులకు గౌరవం తీసుకొచ్చారని అన్నారు. బీజేపీ కోసం తన పూర్తి జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి దత్తాత్రేయ అని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను చదివి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశం కోసం పుట్టిన సంస్థ అని అన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో దత్తాత్రేయ చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. చాలా చిన్న ఇంట్లో నివసిస్తూ ప్రజల మనిషిగా జీవించారని, ప్రజల పట్ల ఆయనకు అపారమైన నిబద్ధత ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1991లో బీజేపీ తరపున ఎంపీగా విజయం సాధించడం ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలక ఘట్టమని గుర్తుచేశారు.

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయాల్లో పదవులతో పాటు శత్రువులు కూడా వస్తారని, అయితే శత్రువులు లేని నాయకుడు బండారు దత్తాత్రేయ అని వ్యాఖ్యానించారు. అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొనడం ఒక గౌరవంగా భావిస్తారని చెప్పారు. అలయ్ బలయ్ తరహా కార్యక్రమాలను ఉత్తరాంధ్రలో కూడా నిర్వహించి అన్ని పార్టీల నాయకులను ఒకే వేదికపైకి తీసుకు రావాలని సూచించారు.

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాజకీయాలు, వ్యాపారం కాదని.. అవి పవిత్రమైనవని అన్నారు. రాజకీయాలు అంటే ప్రజాసేవ మాత్రమేనని స్పష్టం చేశారు. తాను రాజకీయాల్లోకి వస్తానని ఎప్పుడూ ఊహించలేదని చెప్పారు. అధికారంలో ఎవరు ఉన్నా ప్రజాసేవ చేయాలనే భావన ఉండాలని సూచించారు. నేటి రాజకీయాల్లో కూడా విలువలు ఉన్న నాయకులు ఉన్నప్పటికీ రోజురోజుకు రాజకీయ విలువలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ ప్రజల మధ్య నుంచి ఎదిగిన మహోన్నత వ్యక్తి బండారు దత్తాత్రేయ అని కొనియాడారు. అవమానాలు, కష్టాలు, బాధలు ఆయన విజయాన్ని ఆపలేకపోయాయని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దత్తాత్రేయ చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో చేసిన సేవలు ఎనలేనివని చెప్పారు. కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో విశాఖకు అవసరమైన నిధులు తీసుకొచ్చారని, గవర్నర్‌గా ఉన్నప్పటికీ రాజ్‌భవన్‌కే పరిమితం కాకుండా ప్రజల మధ్య జీవించారని తెలిపారు.

# చౌటుప్పల్‌లో రైతుల ధాన్యం నిల్వకు ప్రైవేట్ గోదాం

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పరిశీలన

- **12 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ప్రైవేట్ గోదాం రైతుల కోసం కేటాయింపు**
- **అంకిరెడ్డిగూడెంలో గోదాం పరిశీలించిన మునుగోడు ఎమ్మెల్యే**
- **3 లక్షల బ్యాగుల ధాన్యం నిల్వకు ప్రత్యేక ఏర్పాట్లు**
- **రైతుల వరి ధాన్యం సేకరణపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**
- **వచ్చే 10 రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలని లక్ష్యం**
- **హమాలీల కొరత, మిల్లర్ల సమస్యలతో ఆలస్యమైందని వివరణ**
- **చౌటుప్పల్, నారాయణపూర్‌లో రెట్టింపు, నాలుగు రెట్లు దిగుబడి పెరుగుదల**
- **ధాన్యం సేకరణపై ప్రభుత్వ పెద్దలతో నిరంతర సమన్వయం**
- **రైతులకు అసౌకర్యం కలిగినందుకు ప్రభుత్వ తరపున క్షమాపణ**
- **అదనపు గోదాముల వినియోగంతో ధాన్యం సేకరణ వేగవంతం**




చౌటుప్పల్ వెలుతురు మే 25:

చౌటుప్పల్ మండలంలో రైతుల ధాన్యం నిల్వకు సంబంధించి కీలక చర్యలు తీసుకున్నారు. మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవతో 12 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం (సుమారు 3 లక్షల బ్యాగులు) గల ప్రైవేట్ గోదామును రైతుల ధాన్యం నిల్వ కోసం కేటాయించారు.

చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంలో రైతులకు కేటాయించిన ప్రైవేట్ గోదామును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వ, సేకరణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, లక్షా యాభై వేల క్వింటాళ్ల సామర్థ్యం గల ప్రైవేట్ గోదామును రైతుల వరి ధాన్యం నిల్వ కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. వచ్చే పది రోజుల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ధాన్యం సేకరణపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ పెద్దలతో, ఉన్నతాధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చౌటుప్పల్ మండలంలో ఈసారి రెండు రెట్లు, నారాయణపూర్ మండలంలో నాలుగు రెట్లు ఎక్కువగా ధాన్యం దిగుబడి పెరిగిందని వివరించారు.

ధాన్యం దిగుబడి పెరగడం, హమాలీల కొరత, కొందరు మిల్లర్ల వ్యవహారం కారణంగా సేకరణలో ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని ఆయన అన్నారు. రైతులకు కలిగిన ఇబ్బందులకు ప్రభుత్వం తరపున క్షమాపణ తెలిపారు.

ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలబడే లక్ష్యంతో రాత్రింబవళ్లు పనిచేస్తోందని చెప్పారు. వచ్చే పది రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

అధిక నిల్వ సామర్థ్యం ఉన్న ప్రైవేట్ గోదాములను కూడా రైతుల కోసం వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# మునుగోడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

## ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్, కస్తూర్బా పాఠశాల మౌలిక సదుపాయాల విస్తరణ

- **మునుగోడు మండల కేంద్రంలో రూ.30 లక్షల ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ నిర్మాణానికి శంకుస్థాపన**
- **కస్తూర్బా బాలికల పాఠశాలలో రూ.62 లక్షల ప్రహరీ గోడ పనులకు ప్రారంభం**
- **పాఠశాల స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**
- **విద్యార్థినుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రజాప్రతినిధి**
- **కస్తూర్బా పాఠశాల భవనాలు, వంటగది, డైనింగ్ హాల్ పరిశీలన**
- **టాయిలెట్లు, స్నానపు గదుల విస్తరణపై అధికారులకు సూచనలు**
- **డ్రెస్సింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు**
- **వంటగది పక్కనే స్టోర్ గది, డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని సూచన**
- **మౌలిక సదుపాయాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశం**




- **కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొనడం**

మునుగోడు వెలుతురు మే 25:

మునుగోడు మండల కేంద్రంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. మండల కేంద్రంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించబోయే ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ భవనాలకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం కస్తూర్బా బాలికల పాఠశాలలో రూ.62 లక్షల వ్యయంతో చేపట్టనున్న ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనుల కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించిన ప్రజాప్రతినిధి, పాఠశాలలోని వివిధ మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించారు. కస్తూర్బా పాఠశాల భవనంతో పాటు వంటగది, డైనింగ్ హాలు, తరగతి గదులు, టాయిలెట్లు వంటి సదుపాయాలను పరిశీలించి, విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న టాయిలెట్లతో పాటు అదనంగా స్నానపు గదులు, డ్రెస్సింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వంటగది పక్కనే వంట సామాను నిల్వ చేసే స్టోర్ గది, దాని పక్కనే డైనింగ్ హాల్ ఉండే విధంగా నిర్మాణ ప్రణాళికను సవరించాలని సూచించారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలతో పాటు చేయాల్సిన పనులపై సమగ్ర జాబితాను రూపొందించాలని వ్యక్తిగత సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కస్తూర్బా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లల్లో సర్కారు ఫెయిల్

## సీఎం లెక్కలు బూటకం

### : ఏలేటి మహేశ్వర్ రెడ్డి





- **80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయన్నది పచ్చి అబద్ధం**
- **క్షేత్రస్థాయిలో 30 శాతం కూడా కొనలేదు**
- **రైతులను దళారుల చేతుల్లోకి నెట్టేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**
- **గన్నీ బ్యాగులు, హమాలీ, తరుగు పేరిట దోపిడీ**
- **వర్షా లు వస్తుండగా కొనుగోలు కేంద్రాల ఎత్తివేతపై ఆందోళన**
- **రైతుల పక్షాన బీజేపీ 'రైతు బస్సు యాత్ర' కొనసాగుతుంది**

హైదరాబాద్ వెలుతురు మే 25:

రాష్ట్రంలో రైతాంగ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుబట్టారు తెలంగాణ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి. ముఖ్యమంత్రి చెప్పిన పంట కొనుగోళ్ల లెక్కలు పూర్తిగా తప్పుడువని, క్షేత్రస్థాయిలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. రైతుల నుంచి తమకు అందుతున్న సమాచారం ప్రకారం ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 25 నుంచి 30 శాతం కంటే ఎక్కువ పంట కొనుగోళ్లు జరగలేదని పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు.

ముఖ్యమంత్రి 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని ప్రకటించడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి చూస్తే ప్రభుత్వ వాదనలకు భిన్నంగా ఉందని తెలిపారు. రైతులు రోజులు తరబడి ధాన్యం, మక్కజొన్న నిల్వ ఉంచుకుని ఇబ్బందులు పడుతున్నారని, తేమ పేరుతో కొనుగోళ్లు ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు.

**వరి కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం**

రాష్ట్రంలో ఈసారి సుమారు 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చినప్పటికీ ప్రభుత్వం కేవలం 90 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించిందని తెలిపారు. అందులోనూ ఇప్పటివరకు 25 నుంచి 30 శాతం మాత్రమే కొనుగోలు జరిగిందని ఆరోపించారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులు, దళారులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని చెప్పారు.

**మక్కజొన్న రైతులకు భారీ నష్టం**

మక్కజొన్న కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు 43 లక్షల టన్నుల మక్కజొన్న దిగుబడి వస్తుండగా మార్క్‌ఫెడ్ కేవలం 14.89 లక్షల టన్నుల కొనుగోళ్లకే పరిమితమైందన్నారు. కొనుగోళ్లు ఏప్రిల్ చివర్లో ఆలస్యంగా ప్రారంభించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు.

క్వింటాలుకు రూ.2,400 మద్దతు ధర ఉండగా.. దళారులు కేవలం రూ.1,600కే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రతి క్వింటాలుపై రైతులు రూ.800 వరకు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మధ్యవర్తులు లాభపడుతున్నారని విమర్శించారు.

**పొద్దుతిరుగుడు రైతులపై నిర్లక్ష్యం**

పొద్దుతిరుగుడు పంట కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం కేవలం కంటితుడుపు చర్యలు చేపడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో 4.80 లక్షల టన్నుల దిగుబడి వచ్చినప్పటికీ ప్రభుత్వం కేవలం 3,690 టన్నుల కొనుగోళ్లకే అనుమతి ఇచ్చిందని చెప్పారు. అంటే మొత్తం దిగుబడిలో ఒక్క శాతం కూడా ప్రభుత్వం కొనడం లేదని విమర్శించారు. రైతులు పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు కనీస భరోసా లేకుండా పోయిందన్నారు.

**కొనుగోలు కేంద్రాల ఎత్తివేతపై ఆగ్రహం**

మరో వారం లేదా పది రోజుల్లో కొనుగోలు కేంద్రాలను ఎత్తివేసే పరిస్థితి కనిపిస్తోందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయని, ఇలాంటి సమయంలో రైతులను అనాథలుగా విడిచిపెట్టడం దారుణమన్నారు. కొనుగోళ్లు పూర్తి కాకముందే కేంద్రాలను మూసివేస్తే రైతులకు అపార నష్టం జరుగుతుందని హెచ్చరించారు.

**రైతు హామీలన్నీ బుట్టదాఖలు**

రైతుబంధు, రుణమాఫీ, పంట భీమా, బోనస్ వంటి కీలక హామీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందన్నారు. రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు.

**యూరియా సరఫరాలో అవ్యవస్థ**

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడా యూరియా కేటాయిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా పంపిణీ చేయడంలో విఫలమైందని తెలిపారు. యాప్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సమయానికి ఎరువులు అందక రైతులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

**ఐకెపీ కేంద్రాల్లో దోపిడీ**

ఐకెపీ కొనుగోలు కేంద్రాల్లో భారీగా అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గన్నీ బ్యాగుల కొరత సృష్టించి ఒక్కో బ్యాగుపై రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. హమాలీల పేరుతో అదనంగా మరో రూ.30 తీసుకుంటున్నారని తెలిపారు.

తరుగు పేరుతో ప్రతి బస్తాకు 2 కిలోల కోత విధిస్తుండగా.. రైస్ మిల్లర్లు మరో 2 నుంచి 3 కిలోల వరకు కోత పెడుతున్నారని ఆరోపించారు. మొత్తంగా ప్రతి సంచిపై 10 నుంచి 12 శాతం వరకు నష్టం జరుగుతోందన్నారు. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన రైతులపై ఇది అదనపు భారం అవుతోందని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నది 'అభయ హస్తమా'.. లేక రైతుల గొంతు కోసే 'కబంధ హస్తమా' అని ఆయన ప్రశ్నించారు.

**రైతుల మరణాలపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీజేపీ**

ధాన్యపు కుప్పల దగ్గరే గుండెపోటుతో మృతి చెందిన రైతుల కుటుంబాలను బీజేపీ నాయకులు పరామర్శిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా రైతుల మరణాల లెక్కలను విడుదల చేసి.. బాధిత కుటుంబాలకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**రైతు బస్సు యాత్రతో ప్రభుత్వంపై ఒత్తిడి**

రైతుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికే బీజేపీ 'రైతు బస్సు యాత్ర' చేపట్టిందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ యాత్రలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అగ్రికల్చర్ మార్కెట్ సెంటర్లను సందర్శిస్తూ రైతుల సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. తమ యాత్ర గురించి తెలిసిన వెంటనే అధికారులు రాత్రికి రాత్రే లారీలు ఏర్పాటు చేసి స్టాక్ లిఫ్ట్ చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతు బస్సు యాత్ర ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి కొనుగోళ్లు వేగవంతం చేయించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

# “తెలంగాణలో బీసీలకు ఓటు హక్కు ఉంది, కానీ బీసీలకు సీఎం హక్కు లేదా?”

తెలంగాణ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే ఒక స్పష్టమైన వాస్తవం కనిపిస్తుంది. ఈ రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు రాజకీయంగా ఓటు బ్యాంక్‌గా ఉపయోగించబడినా, అధికారంలో మాత్రం తగిన స్థానం పొందలేకపోయారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మోస్తున్న వర్గాలు, కష్టజీవుల సమాజాలు, చేతివృత్తుల కుటుంబాలు, వ్యవసాయ ఆధారిత వర్గాలు అన్నీ కలిపి ఉన్న బీసీ సమాజం ఎన్నికల సమయంలో ప్రతి పార్టీకి అవసరమవుతుంది. కానీ అధికార పీఠం దగ్గరకు వచ్చేసరికి అదే బీసీ సమాజం పక్కకు నెట్టబడుతుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు నుంచీ, ఏర్పాటయ్యాక కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుండటం బీసీలలో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరకూ ముఖ్యమంత్రి పదవిని పరిశీలిస్తే ఎక్కువగా అగ్రవర్ణాలకు చెందిన నాయకులే అధికారంలోకి వచ్చారు. బూర్గుల రామకృష్ణారావు కాలం నుండి నేటి వరకు రాష్ట్రాన్ని పాలించిన నాయకుల సామాజిక వర్గాలను చూస్తే బీసీలకు రాజకీయంగా ఎంత దూరం ఉంచారో స్పష్టమవుతుంది. బీసీలకు పదవులు ఇచ్చినా అవి ఎక్కువగా పార్టీ స్థాయి పదవుల వరకే పరిమితం అయ్యాయి. కానీ అసలు అధికార కేంద్రం అయిన ముఖ్యమంత్రి పదవి మాత్రం దూరంగానే ఉంచబడింది.కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే “సామాజిక న్యాయం”, “సమగ్ర అభివృద్ధి”, “ప్రజా పాలన” వంటి నినాదాలను ఎక్కువగా వినిపించిన పార్టీ అదే. కానీ ఆ నినాదాలు కార్యరూపంలో ఎంత వరకు అమలయ్యాయన్న ప్రశ్నకు సమాధానం మాత్రం బీసీ సమాజానికి ఇప్పటికీ దొరకలేదు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, తెలంగాణ ఏర్పడిన తర్వాతనూ బీసీలకు ముఖ్యమంత్రి పదవి వస్తుందని ఎన్నో ఆశలు కలిగించబడినా ఆ ఆశలు నెరవేరలేదు. పీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వడం ద్వారా సమాజాన్ని సంతృప్తిపరచాలని ప్రయత్నం జరిగినా, అది అసలు అధికారాన్ని పంచుకున్నట్టుగా బీసీలు భావించడం లేదు. ఎందుకంటే పార్టీ అధ్యక్ష పదవి ఒక రాజకీయ బాధ్యత మాత్రమే, కానీ ప్రభుత్వాన్ని నడిపే అధికారం ముఖ్యమంత్రి చేతిలోనే ఉంటుంది.

ఇదే ప్రశ్న ఇప్పుడు తెలంగాణలో బలంగా వినిపిస్తోంది. “ కాంగ్రెస్ పార్టీ బీసీల పై నిజంగా గౌరవం ఉంటే ముఖ్యమంత్రి ఎందుకు చేయలేదు?” అనే ప్రశ్న సామాన్య కార్యకర్త నుండి చదువుకున్న యువత వరకు చర్చకు వస్తోంది. కేవలం ఎన్నికల సమయంలో బీసీలను గుర్తు చేసుకుని, ఎన్నికలు పూర్తయిన తర్వాత వారిని పక్కన పెట్టడం రాజకీయ మోసమేనని చాలామంది భావిస్తున్నారు. ముఖ్యంగా కామారెడ్డి డిక్లరేషన్‌లో 42 శాతం రిజర్వేషన్ల హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అదే సమయంలో బీసీ ముఖ్యమంత్రి అంశంపై స్పష్టత ఇవ్వకపోవడం మరింత అనుమానాలకు దారి తీసింది.

రాహుల్ గాంధీ బీసీల సాధికారత గురించి పలుమార్లు మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన అవసరమని కూడా చెప్పారు. కానీ తెలంగాణలో మాత్రం ఆ ఆలోచనకు అనుగుణంగా రాజకీయ నిర్ణయం తీసుకోలేకపోయారని విమర్శలు వస్తున్నాయి. “బీసీలకు న్యాయం” అనే మాటలు చెప్పడం ఒకటి, నిజంగా అధికారంలో భాగస్వామ్యం కల్పించడం మరోటి. బీసీ సమాజం ఇప్పుడు మాటలు కాదు, అధికారంలో వాటా కోరుతోంది. అదే అసలు సామాజిక న్యాయం అని వాదిస్తోంది.

గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించిన పలువురు బీసీ నాయకుల రాజకీయ ప్రయాణాన్ని చూస్తే ఈ అసంతృప్తి ఎందుకు వచ్చిందో అర్థమవుతుంది. డి. శ్రీనివాస్ వంటి నాయకుడు పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నో సంవత్సరాలు పార్టీ కోసం పని చేసినా ముఖ్యమంత్రి కాలేకపోయారు. వి. హనుమంతరావు, కూడా దీర్ఘకాలం పార్టీకి సేవలందించినప్పటికీ ముఖ్యమంత్రి పదవి అందలేదు. కే. కేశవరావు, పొన్నాల లక్ష్మయ్య, ఇప్పుడు ఉన్న పిసిసి ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ వంటి నాయకులు కూడా పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించినా అధికారం దగ్గరకు రాలేకపోయారు. అంటే బీసీలకు పార్టీ కోసం కష్టపడే బాధ్యత ఇస్తారు కానీ, అధికారాన్ని మాత్రం ఇవ్వరు అన్న భావన బలపడింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఇదే పరిస్థితి కొనసాగడం బీసీలలో మరింత అసంతృప్తిని పెంచింది. రాష్ట్ర జనాభాలో పెద్ద వర్గంగా ఉన్న బీసీలకు కనీసం ఉపముఖ్యమంత్రి పదవి కూడా ఇవ్వకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. అధికారంలో భాగస్వామ్యం లేకుండా కేవలం సంక్షేమ పథకాలు ప్రకటించడం ద్వారా సమాజాన్ని సంతృప్తిపరచలేమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎందుకంటే రాజకీయ శక్తి లేకపోతే సామాజిక గౌరవం కూడా పూర్తిగా రాదన్న అవగాహన ఇప్పుడు బీసీ సమాజంలో పెరుగుతోంది.

ఇక కర్ణాటక ఉదాహరణను తెలంగాణ బీసీలు తరచుగా ప్రస్తావిస్తున్నారు. అక్కడ సిద్ధరామయ్య వంటి బీసీ నాయకుడిని కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా చేసింది. అయితే తెలంగాణలో మాత్రం అదే పార్టీ ఎందుకు ఆ నిర్ణయం తీసుకోలేకపోయిందన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. ఒక రాష్ట్రంలో బీసీలకు నాయకత్వం ఇవ్వగలిగిన పార్టీ, మరో రాష్ట్రంలో ఎందుకు వెనుకడుగు వేసిందన్న సందేహం సహజంగానే వస్తోంది. ఇది కేవలం వ్యక్తుల విషయం కాదు, రాజకీయ సంకల్పం గురించి ప్రశ్న.

తెలంగాణలో బీసీలు కేవలం ఓటర్లే కాదు, రాజకీయంగా నిర్ణయాత్మక శక్తి. గ్రామీణ స్థాయి నుండి పట్టణాల వరకు ప్రతి ఎన్నికలోనూ బీసీల ఓట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినా ముఖ్యమంత్రి పదవి విషయంలో మాత్రం వారిని పక్కన పెట్టడం ప్రజాస్వామ్య ఆత్మకు విరుద్ధమని చాలామంది భావిస్తున్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న వర్గానికి నాయకత్వ అవకాశం ఇవ్వకపోవడం సమానత్వ సూత్రాలకు వ్యతిరేకమని వాదిస్తున్నారు.

బీసీ సమాజంలో ఇప్పుడు ఒక కొత్త చైతన్యం కనిపిస్తోంది. “మాకు కేవలం హామీలు కాదు, అధికారంలో భాగస్వామ్యం కావాలి” అనే భావన బలపడుతోంది. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీపై మాత్రమే కాదు, దాదాపు అన్ని ప్రధాన పార్టీలపై ఉన్న అసంతృప్తి. టిడిపి, బిఆర్ఎస్, బిజెపి, కమ్యూనిస్టు పార్టీలు కూడా బీసీలను ప్రధాన నాయకత్వ స్థానాలకు తీసుకురావడంలో విఫలమయ్యాయని విమర్శలు ఉన్నాయి. ప్రతి పార్టీ బీసీల ఓట్ల కోసం పోటీ పడుతుంది కానీ, ముఖ్యమంత్రి పదవి విషయంలో మాత్రం వెనుకంజ వేస్తుంది. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో బీసీ రాజకీయాలు మరింత ప్రభావవంతంగా మారే అవకాశముంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో బీసీ యువత రాజకీయ చైతన్యంతో ముందుకు వస్తోంది. కేవలం కుల సమీకరణల రాజకీయాలకు పరిమితం కాకుండా, అధికారంలో సముచిత వాటా కోరుతోంది. ఇది భారత ప్రజాస్వామ్యంలో ఒక కొత్త దశకు సంకేతంగా కూడా చూడవచ్చు.

సామాజిక న్యాయం అంటే కేవలం రిజర్వేషన్లు మాత్రమే కాదు. అధికార నిర్మాణంలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం కూడా అదే స్థాయిలో ముఖ్యమైనది. ముఖ్యమంత్రి పదవి, కీలక మంత్రిత్వ శాఖలు, నిర్ణయాధికార స్థానాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లేకపోతే “సామాజిక న్యాయం” అనే నినాదం అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. బీసీలు ఇప్పుడు అదే విషయాన్ని గట్టిగా చెబుతున్నారు.

రాజకీయ పార్టీలు ఈ అసంతృప్తిని తేలికగా తీసుకుంటే అది భవిష్యత్తులో పెద్ద రాజకీయ పరిణామాలకు దారి తీసే అవకాశం ఉంది. ఎందుకంటే ఇప్పటి బీసీ సమాజం గతంతో పోలిస్తే ఎక్కువగా రాజకీయంగా చైతన్యవంతమైంది. సోషల్ మీడియా, విద్య, ఉద్యోగాలు, సంఘటిత చర్చల ద్వారా తమ హక్కులపై అవగాహన పెంచుకుంటోంది. కేవలం భావోద్వేగ నినాదాలతో వారిని నిలబెట్టడం ఇక సాధ్యం కాదని రాజకీయ వర్గాలే గుర్తిస్తున్నాయి.

తెలంగాణ రాజకీయ చరిత్రలో బీసీల పాత్రను ఎవరూ నిరాకరించలేరు. ఉద్యమాల్లోనూ, ఎన్నికల్లోనూ, పార్టీ నిర్మాణంలోనూ బీసీలు ముందుండే పనిచేశారు. కానీ ఆ కృషికి తగిన రాజకీయ గౌరవం దక్కలేదన్న భావన సమాజంలో బలంగా ఉంది. అందుకే ఇప్పుడు బీసీ సమాజం అడుగుతున్న ప్రశ్న ఒక్కటే, “మా ఓట్లు కావాలి కానీ, మా నాయకత్వం వద్దా?”

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపైనా ఉంది. ముఖ్యంగా సామాజిక న్యాయం గురించి ఎక్కువగా మాట్లాడే పాత కొత్త పార్టీలపై మరింత ఉంది. మాటల్లో కాదు, చర్యల్లో బీసీలకు న్యాయం జరిగితేనే ప్రజలు నమ్ముతారు. లేకపోతే “సామాజిక న్యాయం” అనే నినాదం కేవలం రాజకీయ నాటకంగా మిగిలిపోతుంది.

తెలంగాణ భవిష్యత్తు రాజకీయాల్లో బీసీల పాత్ర మరింత కీలకంగా మారబోతోంది. ఈ వర్గాన్ని కేవలం ఓటు బ్యాంక్‌గా చూసే రాజకీయ ధోరణి కొనసాగితే, బీసీలు తమ రాజకీయ నిర్ణయాలను స్వయంగా తీసుకునే దిశగా ముందుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలం ఎంత ముఖ్యమో, రాజకీయ చైతన్యం కూడా అంతే ముఖ్యమని ఇప్పుడు తెలంగాణ బీసీ సమాజం నిరూపిస్తోంది.



మన్నారం నాగరాజు.
సామాజిక రాజకీయ విశ్లేషకులు.


# చంద్రునిపై అడుగు... మనసులో పరుగు!

1969వ సంవత్సరం జూలై 20వ తేదీ. మానవ చరిత్ర పుటలలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అత్యంత అద్భుతమైన క్షణం అది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అపోలో 11 నౌక చంద్రుని ఉపరితలాన్ని చేరింది. వ్యోమగామి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తన కుడి కాలును చంద్రుని మట్టిపై మోపిన ఆ అపూర్వ దృశ్యాన్ని చూసి, భూమి మీద కోట్లాది మంది టెలివిజన్ తెరల ముందు కూర్చుని ఆనందాశ్రువులతో చప్పట్లు కొట్టారు. "మనిషి ఒక్కడికి ఇది ఒక చిన్న అడుగు కానీ మానవాళికి ఒక మహత్తరమైన ఘనవిజయం! అని చరిత్ర తన డైరీలో నమోదు చేసుకుంది. విజ్ఞాన శాస్త్రం గెలిచింది, సాంకేతికత శిఖరాన్ని అందుకుంది, మానవుని అధమ్య సాహసం మేఘాలను దాటి నక్షత్రాల ఎత్తును తాకింది.కానీ అదే రాత్రి, ప్రపంచమంతా ఆ అద్భుతాన్ని చూసి పండగ చేసుకుంటున్న వేళ, ఆ విజయాన్ని సాధించిన సాధారణ మానవుడు తన ఇంటికి తిరిగి వచ్చి, తన భార్యతో చిన్నపాటి విషయానికి గొడవపడి, మనస్తాపంతో నిద్రపోయాడు. తన పిల్లల మనసులోని మాటలు వినడానికి అతనికి ఓపిక లేకపోయింది. తన అంతరంగంలో గూడుకట్టుకున్న ఒంటరితనపు అగాధాన్ని, మానసిక అశాంతిని ఏ శాటిలైట్ సహాయంతోనూ పూడ్చుకోలేకపోయాడు.

ఇదే ఈనాడు మన ముందున్న మిలియన్ డాలర్ల ప్రశ్న మనిషి కోట్ల మైళ్ల దూరంలో ఉన్న చంద్రుడి వరకు విజయవంతంగా వెళ్లాడు సరే, కానీ తన పక్కనే ఉన్న తన మనసు లోతుల్లోకి ప్రయాణించగలిగాడా?

ఈ రోజు మనం ఐదవ తరం సాంకేతిక విప్లవంలో జీవిస్తున్నాం. అంతరిక్షంలో వేలాది శాటిలైట్లు నిరంతరం పరిభ్రమిస్తూ సమాచారాన్ని అందిస్తున్నాయి. అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్‌ఫోన్ ద్వారా ప్రపంచమంతా మన గుప్పిట్లోకి వచ్చేసింది. కృత్రిమ మేధస్సు (AI) మనిషి మెదడు కంటే వేగంగా ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకుంటోంది. శాస్త్రవేత్తలు ప్రాణాంతక క్యాన్సర్‌ను సైతం పూర్తిగా జయించే దిశగా రాత్రింబగళ్లు పరిశోధనలు చేస్తున్నారు, మనిషి ఆయుఃప్రమాణాన్ని వందేళ్లకు పెంచే అద్భుత ఔషధాలను కనుగొంటున్నారు, మంగళ గ్రహంపై మానవ నివాసాలను ఏర్పాటు చేసే సరికొత్త కలలు కంటున్నారు. కానీ ఈ నాణేనికి మరో భయంకరమైన వైపు ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఇటీవలి నివేదికల ప్రకారం, మానసిక అనారోగ్యం అనేది నేటి ఆధునిక ప్రపంచాన్ని పీడిస్తున్న అతిపెద్ద మహమ్మారి. తీవ్రమైన నిరాశ (Depression), ఒంటరితనం, మానసిక ఆందోళన (Anxiety) ఇవి కోట్లాది మంది అమాయక జీవితాలను నిశ్శబ్దంగా మింగేస్తున్నాయి.సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ఒక వ్యక్తికి లక్షల మంది ఫ్రెండ్స్ మరియు ఫాలోవర్స్ ఉండవచ్చు. కానీ, రాత్రి వేళ మనసు విప్పి తన బాధను పంచుకోవడానికి ఒక్క నిజమైన స్నేహితుడు కూడా లేడని వేలాది మంది యువతీ యువకులు తీవ్రమైన ఆక్రోశాన్ని, మానసిక క్షోభను వెళ్లగక్కుతున్నారు. సమాజంలో ఆర్థిక సంపన్నత, విలాసవంతమైన వస్తువులు పెరిగాయి, కానీ వాటితో పాటే ఆత్మహత్యల సంఖ్య కూడా ఆందోళనకరంగా పెరుగుతూనే ఉంది.ఇది కేవలం ఒక సామాజిక వైరుధ్యం మాత్రమే కాదు. ఇది మన ఆధునిక నాగరికత ఎదుర్కొంటున్న అతిపెద్ద నైతిక వైఫల్యం. మనం బాహ్య ప్రపంచాన్ని, భౌతిక సంపదను జయించడానికి మన శక్తియుక్తులను, వనరులను పూర్తిగా ధారపోశాం. కానీ, మన కంటికి కనిపించని అంతరంగపు ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి మాత్రం మనకు అస్సలు సమయమే లేదు.భారతీయ సనాతన తత్వశాస్త్రంలో అంతర్ముఖత అనే అద్భుతమైన భావన ఉంది. అంతర్ముఖత అంటే చూపును బయటి ప్రపంచం వైపు కాకుండా, మన లోపలికి తిప్పుకుని చూడటం. అద్వైత వేదాంతం ఎప్పుడో స్పష్టంగా చెప్పింది.బాహ్య ప్రపంచాన్ని తెలుసుకోవడం కాదు, ఆత్మ అన్వేషణే అత్యున్నతమైన జ్ఞానం. బుద్ధుడు తన ప్రియ శిష్యులతో ఒక సందర్భంలో అన్నాడు.రాజ్యాలను, బయటి ప్రపంచాన్ని జయించేముందు, నీ లోపల నిరంతరం జరిగే మానసిక సంఘర్షణను జయించు. ఆధునిక యుగంలో రమణ మహర్షి ప్రతి ఒక్కరినీ సూటిగా ఒకే ప్రశ్న అడిగారు, "నువ్వు ఎవరు?" ఆ ఒక్క చిన్న ప్రశ్నలోనే సమస్త వేదాంత తత్వసారం నిక్షిప్తమై ఉంది.పాశ్చాత్య ఆధునిక మనస్తత్వ శాస్త్రం (Psychology) కూడా ఈనాటికీ ఇదే సత్యాన్ని నొక్కి చెప్తోంది. ప్రసిద్ధ మనస్తత్వవేత్త కార్ల్ జుంగ్ ఒకచోట అన్నారు.మీరు మీ అంతరంగంలోని చీకటిని, బలహీనతలను పూర్తిగా అర్థం చేసుకోకపోతే, వాటిని ఏనాటికీ జయించలేరు. అంటే మన మనసులో దాగి ఉన్న భయాలు, అణచివేసిన బాధలు, ఆందోళనలు, చిన్ననాటి చేదు జ్ఞాపకాల గాయాలు వీటిని మనం ధైర్యంగా ముఖాముఖి చూసుకోకపోతే, అవి మనల్ని లోపలి నుంచి నిలువునా కొరికి తింటాయి. సమాజంలో నువ్వు ఎంతటి గొప్ప బాహ్య విజయాలు సాధించినా, అంతర్గత శాంతి లేకపోతే ఆ జీవితం వట్టి ఖాళీ కుండ లాంటిదే.నిజానికి, మనసు అనేది ఒక అజ్ఞాత మహాఖండం. ఆ ఖండానికి ప్రయాణించడానికి ఏ నాసా రాకెట్టూ, ఇంధనమూ అవసరం లేదు. కానీ ఆ ప్రయాణానికి అంతకంటే ఎక్కువ మానసిక సాహసం కావాలి. అదే నిష్కల్మషమైన నిజాయితీ, ఆత్మపరిశీలన మరియు ప్రశాంతమైన మౌనం.ఈ ఆధునిక డిజిటల్ యుగంలో మనం నిరంతరం ఏదో ఒక శబ్దంలో, గందరగోళంలో మునిగి తేలుతున్నాం. ఉదయం లేచింది మొదలు మొబైల్ నోటిఫికేషన్లు, వాట్సప్ సందేశాల టోన్లు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, న్యూస్ ఫీడ్లు, యూట్యూబ్ వీడియోల సందడి ఇలా ఒక్క నిమిషమైనా మనం నిశ్శబ్దంగా, ప్రశాంతంగా కూర్చోలేకపోతున్నాం. ఎందుకు మనం నిశ్శబ్దాన్ని చూసి అంతగా భయపడుతున్నాం? ఎందుకంటే బాహ్య ప్రపంచం నిశ్శబ్దంగా మారినప్పుడు, మన లోపలి మనసు మనతో మాట్లాడటం ప్రారంభిస్తుంది. ఆ అంతరాత్మ మాటలను వినడం చాలా మందికి మానసికంగా భరించలేనిదిగా ఉంటుంది.అప్పుడు మనసు లోపలి నుంచి నెమ్మదిగా అడుగుతుంది.ఇన్ని హంగులున్నా నువ్వు నిజంగా సంతోషంగా ఉన్నావా? నీ నిత్య జీవితానికి అసలైన అర్థం ఏమిటి? అసలు నువ్వు ఎవరి కోసం, దేని కోసం ఇంతగా కష్టపడుతూ జీవిస్తున్నావు?ఈ క్లిష్టమైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పే ధైర్యం లేక, మనం వెంటనే సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తూ ఆ ప్రశ్నల నుండి పారిపోతాం. లేదా ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో సినిమాలు చూస్తూ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాం. ఇది స్పష్టమైన మానసిక పలాయనవాదం కానీ మనం దీన్ని ఆధునిక భాషలో వినోదం లేదా రిలాక్సేషన్ అని ముద్దుగా పిలుచుకుంటున్నాం. అయితే, ఈ పలాయనం ఎప్పటికీ శాశ్వతమైనది కాదు. ఏదో ఒక అర్ధరాత్రి, చుట్టూ ప్రపంచమంతా నిద్రిస్తున్న వేళ, మనకు నిద్ర రాని సమయంలో మనసు మళ్లీ వెనక్కి వస్తుంది నేను ఇంకా ఇక్కడే గాయపడి ఉన్నాను. నా బాధను ఒక్కసారైనా వినవా? అని మనల్ని నిలదీస్తుంది.ఒకప్పుడు మానవ సంబంధాలు భూమిలో బలంగా వేళ్లూనుకున్న మహావృక్షాల లాంటివి. అవి తరాల పాటు నిలిచేవి, వాటి భావోద్వేగాల మూలాలు చాలా లోతుగా ఉండేవి. కానీ నేటి ఆధునిక కాలంలో సంబంధాలు కేవలం నీటిపై తేలియాడే ఫ్లోటింగ్ వాటర్ లిల్లీ పువ్వుల లాంటివిగా మారిపోయాయి. అవి పైకి చూడటానికి ఎంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి కానీ, వాటికి నేల మీద గట్టి వేళ్లు ఉండవు.

ఈ డిజిటల్ కాలంలో ఒక లైక్ కొట్టడం అనేది ప్రేమకు ప్రత్యామ్నాయం అయిపోయింది. ఒకరి సోషల్ మీడియా స్టోరీ ని చూడటం అంటే ఆ మనిషిని పూర్తిగా అర్థం చేసుకోవడం అని భ్రమిస్తున్నాం. రంగురంగుల ఎమోజీలు మన గాఢమైన భావోద్వేగాలకు చిహ్నాలు అయ్యాయి. కానీ ఒక మనిషి నిజ జీవితంలో తీవ్రమైన బాధతో ఏడుస్తున్నప్పుడు, ఫోన్‌లో పంపే ఒక ఎమోజీ అతనికి గుండె వెచ్చదనాన్ని ఇవ్వగలదా? వాట్సప్‌లో పంపే ఒక హగ్ స్టికర్, నిజమైన ఆప్యాయతతో కూడిన కౌగిలింతకు ఏనాడైనా సమానమవగలదా?మనం టెక్నాలజీ ద్వారా సంబంధాల విస్తృతిని (Quantity) విపరీతంగా పెంచుకున్నాం కానీ, వాటి మధ్య ఉండాల్సిన మానసిక లోతును (Quality) పూర్తిగా కోల్పోయాం. ఇదే నేటి మానసిక ఒంటరితనానికి అసలైన మూలకారణం. చుట్టూ వంద మంది బంధుమిత్రులు ఉన్నా, నన్ను లోతుగా అర్థం చేసుకునే వాళ్లు ఎవరూ లేరు అనే తీవ్రమైన బాధ ఇది నేటి తరం యువత అనుభవిస్తున్న నిశ్శబ్ద రోదన.అయితే, ఈ వ్యాసాన్ని మనం కేవలం నిరాశతో, నిస్సహాయతతో ముగించవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఈ అంతర్ముఖ ప్రయాణం ఎవరికీ అసాధ్యమైనది ఏమీ కాదు. కేవలం మనం మన దైనందిన జీవితంలో దానిపై కొద్దిగా దృష్టి పెట్టి, కొన్ని మార్పులు చేసుకుంటే సరిపోతుంది.మొదటి అడుగు రోజువారీ బిజీ జీవితంలో కనీసం ఒక పది నిమిషాల పాటు మొబైల్ ఫోన్‌ను పక్కన పెట్టి, కళ్లు మూసుకుని కూర్చోవాలి. మన మనసులో ఎలాంటి ఆలోచనలు వస్తున్నాయో గమనిస్తూ, మనతో మనం మాట్లాడుకోవాలి. అసలైన ధ్యానం అంటే ఇదే మనల్ని మనం ఓపికగా వినడం. రెండవ అడుగు మనసుకు ఏదో అసౌకర్యంగా ఉన్నప్పుడు నాకు బాలేదు అని సాధారణంగా అనడం కాకుండా ప్రస్తుతం నాకు భయంగా ఉంది, లేదా నాకు అవమానంగా అనిపిస్తోంది, నేను విఫలమయ్యాననే బాధ నన్ను వేధిస్తోంది ఇలా మీ భావోద్వేగాన్ని స్పష్టంగా గుర్తించాలి. మానసిక చికిత్సలో దీన్ని లేబలింగ్ (Labeling) అంటారు. ఇలా చేయడం వల్ల మెదడులో ఆందోళన కలిగించే భాగం శాంతించి, నొప్పి తగ్గుతుందని శాస్త్రీయంగా నిరూపితమైంది.మూడవ అడుగు జీవితంలో కనీసం ఒక్క విశ్వసనీయమైన వ్యక్తి ముందైనా, ఎలాంటి అబద్ధపు మాస్కులు లేకుండా, మన మనసులోని భయాలను నిజాయితీగా పంచుకోవాలి. నాకు సహాయం కావాలి, లోపల చాలా బాధగా ఉంది అని ధైర్యంగా చెప్పగలగడం బలహీనత ఎంతమాత్రం కాదు; అది అత్యున్నతమైన మానసిక ధైర్యానికి సంకేతం. నాల్గవ అడుగు మనల్ని మనం ప్రేమించుకోవడం, క్షమించుకోవడం నేర్చుకోవాలి. గతంలో మనం చేసిన తప్పులను, మనకు ఎదురైన పరాజయాలను, పాత బాధలను గుండెల్లోనే మోసుకుంటూ నిరంతరం కుంగిపోవడం ఆపాలి. ఆత్మక్షమాపణ (Selfforgiveness) అనేది గాయపడిన మనసుకు లభించే అత్యున్నతమైన ఔషధం. మన తెలుగు సంస్కృతిలో, సమాజంలో నాకు మనసు బాలేదు, డిప్రెషన్‌గా ఉంది అని నలుగురితో చెప్పడం నేటికీ ఒక సామాజిక నిషిద్ధంగా (Taboo) భావిస్తున్నారు. మగవాళ్లు ఎప్పుడూ ఏడవకూడదు, ధైర్యంగా ఉండాలి,ఆడవాళ్లు అన్ని కష్టాలనూ ఓపికగా భరించాలి, వయసులో పెద్దవాళ్లకు అస్సలు మానసిక కష్టాలు ఉండవు ఇవన్నీ మన సమాజం మానవ మనసుకు వేసిన బలమైన సంకెళ్లు, అపోహలు మాత్రమే.శారీరక ఆరోగ్యం లాగే మానసిక ఆరోగ్యం గురించి బహిరంగంగా మాట్లాడటం అస్సలు సిగ్గుపడవలసిన విషయం కాదు. శరీరానికి జ్వరం లేదా గాయమైతే మనం వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్తాం కదా మరి మనసు తీవ్రంగా బాధిస్తున్నప్పుడు సైకియాట్రిస్ట్ లేదా కౌన్సిలర్ వంటి మానసిక నిపుణుడి దగ్గరకు వెళ్లడంలో తప్పేముంది? నగరాల్లోనే కాదు, ప్రతి బస్తీలో, పల్లెటూర్లలో ఈ మానసిక ఆరోగ్య అవగాహన విరివిగా వ్యాప్తి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది.బడిలో పిల్లలకు చిన్నప్పటి నుంచే గణితం, సైన్స్ నేర్పినట్టే, తమ భావోద్వేగాలను ఎలా నియంత్రించుకోవాలో, ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో నేర్పే భావోద్వేగ పరిపక్వత (Emotional Intelligence) కూడా పాఠ్యాంశంగా నేర్పాలి. ఇది రేపటి తరానికి మనం ఇవ్వగల అత్యంత అమూల్యమైన బహుమతి.భూమి నుండి చంద్రుడికి వెళ్లడానికి దాదాపు 3,84,400 కిలోమీటర్ల సుదీర్ఘ దూరం ప్రయాణించాలి. దానికి కోట్ల రూపాయల ఖర్చు, వేలాది మంది శాస్త్రవేత్తల శ్రమ కావాలి. కానీ, మనల్ని నిరంతరం నడిపించే మన సొంత మనసులోకి వెళ్లడానికి కేవలం కొన్ని నిమిషాల నిశ్శబ్దం, కొద్దిపాటి నిజాయితీ, మనల్ని మనం అన్వేషించాలనే తపన ఉంటే చాలు.విజ్ఞాన శాస్త్రం మనిషిని బాహ్య ప్రపంచంలో వెలుపలికి తీసుకువెళ్లి నక్షత్రాలను చూపించింది. కానీ, ఆధ్యాత్మికత మరియు తత్వశాస్త్రం మనిషిని లోపలికి తీసుకువెళ్లి తనని తాను చూసుకునేలా చేయాలి. మానవ వికాసానికి ఈ రెండు ప్రయాణాలూ సమానంగా ముఖ్యమైనవి. బాహ్య విశ్వాన్ని జయించిన ఆధునిక మనిషి, తన అంతరంగపు విశ్వాన్ని కూడా పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడే ఈ భూమిపై మానవ జన్మకు నిజమైన పరిపూర్ణత, సార్థకత సాధ్యమవుతాయి.మన తెలుగు సాహిత్యంలో ప్రజాకవి వేమన యోగి ఎప్పుడో ఒక అద్భుతమైన పద్యాన్ని చెప్పారు.మనసు లోపల ప్రశాంతతతో, తృప్తితో నిండితే శరీరానికి, ఈ భౌతిక జీవితానికి, మనం పంచుకునే మానవ సంబంధాలకు అన్నీ అర్థవంతంగా మారుతాయి. చంద్రుని నిశ్శబ్ద మట్టిపై మనిషి అడుగు పెట్టడం సాంకేతికంగా గొప్ప విజయమే కావచ్చు. కానీ, మన గందరగోళ మనసు లోతులలోకి ధైర్యంగా దిగి, అక్కడున్న చీకటిని జ్ఞానమనే దీపంతో వెలిగించడం అది అంతకంటే మహత్తరమైన, శాశ్వతమైన విజయం.ఆ అద్భుతమైన అంతరంగ యాత్రను ఈరోజే, ఇప్పుడే మొదలుపెట్టే మానసిక ధైర్యం మనందరికీ కలుగుగాక!





డా .సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher,
9490754169

# రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణికి (101) ఫిర్యాదులు



- ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి
- అధికారులకు ఆదేశం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

ఇబ్రహీంపట్నం వెలుతురు మే 25:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లాకలెక్టర్ కార్యాలయంలోసోమవారం సమీకృత జిల్లాకార్యాలయాల సముదాయ సమావేశ మందిరం లోనిర్వహించిన ప్రజావాణి కార్య క్రమానికి 101ఫిర్యాదులు అందాయి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండివచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లాకలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరి ష్కరించాలని ఆదేశించార అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపు తూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు రెవెన్యూశాఖ37ఇతర శాఖలు64 మొత్తం ద రఖస్తులు101అందాయిఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కిరణ్మయి లోకల్ బాడీస్ వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు సంబంధితఅధికారులు తదితరులు పాల్గొన్నారు

# సేవా స్ఫూర్తికి అంతర్జాతీయ వేదికపై గౌరవం





- మానవ హక్కుల కార్యకర్త సుంకర నరేష్‌కు ప్రతిష్ఠాత్మక 'బీ ది చేంజ్' అవార్డు

కాప్రా, మే 25 (వెలుతురు):

సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న హైకోర్టు న్యాయవాది, మానవ హక్కుల కార్యకర్త, కాప్రాకు చెందిన సుంకర నరేష్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. లండన్ పార్లమెంట్ వెస్ట్‌మినిస్టర్ గుర్తింపు పొందిన 'బీ ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ' ఆధ్వర్యంలో ఆయనకు ప్రతిష్ఠాత్మక అవార్డు ప్రదానం చేశారు.సంస్థ స్థాపకుడు రామ్ కళ్యాణ్ చల్లా నేతృత్వంలో నిర్వహించిన "ఏ డికేడ్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్" కార్యక్రమంలో పదేళ్ల సామాజిక సేవా ప్రస్థానాన్ని, మానవతా విలువలకు చేసిన కృషిని ఘనంగా గుర్తించారు. ఈ కార్యక్రమానికి లండన్ పార్లమెంట్ సభ్యుడు జిమ్ డిక్సన్, లార్డ్ ఉదయకుమార్ నాగరాజు మద్దతు తెలిపారు.

ఆదివారం మాదాపూర్‌లోని మహీంద్రా క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో సుంకర నరేష్ ఈ అవార్డును స్వీకరించారు. విద్యార్థుల సంక్షేమం, మాజీ సైనికుల సంక్షేమ కార్యక్రమాలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, మూగజీవుల పరిరక్షణ వంటి అనేక రంగాల్లో ఆయన అందిస్తున్న సేవలను నిర్వాహకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాగే యువతను సరైన దిశలో నడిపించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.ఈ సందర్భంగా సుంకర నరేష్ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో సేవలందిస్తున్న సంస్థ నుంచి అవార్డు అందుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ గుర్తింపు తనలో మరింత బాధ్యతను పెంచడంతో పాటు సేవా కార్యక్రమాలను విస్తృత స్థాయిలో కొనసాగించేందుకు కొత్త ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు.కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ దుద్దిళ్ల శ్రీనుబాబు, ప్రజాగాయని విమలక్క, సంస్థ సభ్యులు సుహాసిని, దేవ్, స్వప్న, దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ తాగండి... ఆరోగ్యంగా ఉండండి : ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 25:

130 సుభాష్ నగర్ జీడిమెట్ల బస్ డిపో వద్ద బిఆర్ఎస్ నాయకులు కోలా శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పాదాచారులకు మజ్జిగ పంపిణీ చేయడం అనేది మాధవ సేవతో సమానమన్నారు. మజ్జిగ తాగి అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, గుబ్బల లక్ష్మీ నారాయణ, కట్ట సుందర్ బాబు, కట్ట సుకుమార్, ప్రేమ్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి ఆధ్వర్యంలో 12వ సోమవారం అన్నదాన కార్యక్రమం

- ఈ సోమవారం అన్నదాన ప్రభువు ఆరుట్ల గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు తంగడిపల్లి నరేందర్ గౌడ్

మంచాల వెలుతురు మే 25:





మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీకంఠమహేశ్వరస్వామి దేవాలయంలో ప్రతిసోమవారంరోజు గౌడ సంఘం పెద్దలు దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు ఈ సోమవారం అన్నదాన ప్రభువు ఆరుట్ల గౌడ సంఘం అధ్యక్షుడు తంగడిపల్లి నరేందర్ గౌడ్ సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ముందుగా గౌడ సంఘం పెద్దలు అన్నదాన ప్రభువు కంఠమహేశ్వరస్వామికి శివలింగానికి ప్రత్యే క పూజలు చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభంచేశారు భక్తులకు దగ్గర ఉండి అన్నదాన ప్రసాదం వడ్డించిన అన్నదాన కార్యక్రమం కమిటీ సభ్యులు సుంకరి రఘునాథ్ గౌడ్ సుంకరి ప్రవీణ్ గౌడ్ ఎన్నుదుల మహేష్ నుకంరాజు ముదిరాజ్ ఈసందర్భంగా అన్నదాన ప్రభువు గౌడ సంఘం అధ్య క్షుడు నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ఈ సోమవారం రోజు కంఠమహేశ్వర దేవాలయంలో అన్నదా న కార్యక్రమం చేయడం నాకు చాలా ఆనందంగా ఉంది అని అన్నారు కంఠమహేశ్వర దేవాలయ అభివృద్ధి కోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పిస్తాం అని అన్నారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు మాడుగుల కృష్ణ గౌడ్ అయ్యప్పస్వాముల గురుస్వాము లు మాజీ ఎంపీ టీసీ కావాలి శ్రీనివాస్ ముదిరాజ్ లొంగరీ దాసు గౌడ సంఘం సభ్యులు సుంకరి జంగయ్యగౌడ్ పాండాల సత్యనారాయణ గౌడ్ సుంకరి శ్రీనివాస్ గౌడ్ (ఉపాధ్యాయుడు) చెరుకు నరసింహగౌడ్ పాండాల రాములు గౌడ్ అంతటి రాజు గౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ పల్లె శ్రీనివాస్ గౌడ్ మారగోని మాసయ్య గౌడ్ అంతటి దశరథగౌడ్ సుంకరి లచ్చయ్యగౌడ్ సుంకరి శ్రీనివాస్ గౌడ్ కొత్తపల్లి మహేందర్ గౌడ్ భక్తులు కొంగర వెంకటరెడ్డి బొగ్గులపల్లి రాకేష్ రెడ్డి ఎన్ను దుల జగదీష్ బూట్టి కృష్ణ ముదిరాజ్ తవిటి నరసింహ ముదిరాజ్ బొద్రమోని అంజయ్య ముది రాజ్ తదితరులుపాల్గొన్నారు

# ప్రణాళిక బద్ధంగా నాలాల అభివృద్ధితో ముంపు రహిత ప్రాంతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

: బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 25:

సోమవారం 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని గంపల బస్తీలో పర్యటించిన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ నిర్మాణంలో ఉన్న నాలా పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....నాలాల నిర్మాణం ద్వారా వర్షాకాలంలో ముంపు తీవ్రతను తగ్గించడంతో పాటు వేగవంతమైన అభివృద్ధి సాధ్యమన్నారు.ఇప్పటికే నాలాల అభివృద్ధి దాదాపు నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలలో పూర్తయిందని, గత పన్నాండేళ్ల కాలంలో ప్రణాళిక బద్ధంగా నాలాలను అభివృద్ధి పరిచామని అన్నారు.పూర్తిస్థాయి నాలాల అభివృద్ధి ద్వారా "జీరో ముంపు రహిత ప్రాంతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమన్నారు.నాలా నిర్మాణ పనులలో పర్యవేక్షణ, పనుల్లో అలసత్వం తీరుపై అధికారులపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విస్తరణ పనులతో పాటు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ లావణ్య, ఇంజనీరింగ్ ఎస్.ఈ సక్కు భాయ్, వివిధ విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, మైనారిటీ నాయకులు షేక్ ఇస్మాయిల్, సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, గుబ్బల లక్ష్మీ నారాయణ, అడప శేషు, దుర్గా రావు, రంగా, వెంకట్ రెడ్డి, రఘు శంకర్, ప్రసాద్, మణికంత, నదీమ్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంబ్రిడ్జ్ మాంటెస్సోరి ప్రీ స్కూల్ ఘన ప్రారంభోత్సవం




వనస్థలిపురం వెలుతురు మే 25:

సమగ్ర విద్య, సృజనాత్మకత మరియు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన ప్రీస్కూల్ విద్యను అందించేందుకు ప్రారంభించబడుతున్న కేంబ్రిడ్జ్ మాంటెస్సోరి ప్రీ స్కూల్ ఘన ప్రారంభోత్సవానికి మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేయనున్న వారు వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి

మాంటెస్సోరి మరియు కేంబ్రిడ్జ్ ఆధారిత విద్యా విధానాలు, కార్యాచరణ ఆధారిత అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మరియు పిల్లలకు అనుకూలమైన వాతావరణంతో బలమైన విద్యా పునాది అందించేందుకు ఈ విద్యాసంస్థ ప్రారంభమవుతోంది.

ఈ శుభ సందర్భంగా తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు మరియు పరిసర ప్రాంత ప్రజలందరూ హాజరై చిన్నారుల విద్యా ప్రయాణానికి ఆశీర్వదించాలని యాజమాన్యం మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తోంది.

**పాఠశాల ముఖ్య ప్రత్యేకతలు**

- మాంటెస్సోరి & కేంబ్రిడ్జ్ కరికులం
- కార్యాచరణ ఆధారిత అభ్యాసం
- మైండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్
- సురక్షితమైన & పిల్లలకు అనుకూలమైన క్యాంపస్
- అనుభవజ్ఞులైన అధ్యాపకులు & సహాయక సిబ్బంది
- రవాణా సౌకర్యం అందుబాటులో ఉంది
- పరిమిత అడ్మిషన్లు ప్రారంభం

వేదిక: వనస్థలిపురం

మీ అందరి ఆదరణ, ఆశీస్సులతో చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ఆకాంక్షిస్తున్నాము.

### ప్రపంచంలోనే ఎత్తైన మౌంట్ ఎవరెస్టు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన ఐరన్ మ్యాన్ పల్పునూరి తులసిరెడ్డిని సన్మానించిన భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 25:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ గ్రామానికి చెందిన ఐరన్ మ్యాన్ పల్పునూరి తులసిరెడ్డి ప్రపంచంలోనే ఎత్తైన మౌంట్ ఎవరెస్టు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి స్వగ్రామమైన భౌరంపేట్‌కు తిరిగి వచ్చిన సందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పల్పునూరి తులసిరెడ్డి శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. గ్రామానికి, ప్రాంతానికి తులసిరెడ్డి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈకార్యక్రమంలో మిద్దెల యాదిరెడ్డి, పల్పునూరి పద్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి(చింటు), పల్పునూరి విష్ణువర్ధన్ రెడ్డి, పల్పునూరి బల్వంత్ రెడ్డి, గుర్రాల శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ అభివృద్ధి ప్రయాణం : శ్రీ సీపీ రాధాకృష్ణన్


రచయిత- భారత ఉపరాష్ట్రపతి

నేను చిన్న పిల్లవాడిగా ఉన్నప్పుడు తిరుప్పూర్‌లో పాఠశాల విద్యనభ్యసించే సమయంలో దేశం గురించి నాకు ఎన్నో కలలుండేవి. నాలో ఎన్నో ప్రశ్నలు రేకెత్తేవి. భారత్ మళ్లీ ఎప్పుడు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది? ప్రపంచ వేదికపై ఎప్పుడు శక్తిమంతమైన దేశంగా నిలుస్తుంది? పేద, అణగారిన వర్గాల సోదరీ సోదరులు ఎప్పుడు గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతారు? నా యుక్త వయసులోని ఆలోచనలు ఇప్పుడు నిజమవటం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది.

నేను ఎప్పుడూ స్వామి వివేకానంద మాటలను గుర్తుచేసుకుంటాను. "లేవండి. మేల్కొనండి. గమ్యం చేరే వరకు ఆగకండి". తమిళనాడు గడ్డ నుంచి స్వామిజీ పలికిన ఈ మాటలు ప్రతి ఒక్కరిలోనూ దేశభక్తిని, అంకితభావాన్ని కలిగించే అపారమైన శక్తి గలవి.

భారత్ పూర్తి సామర్థ్యం బయటకు వచ్చినప్పుడు యావత్ ప్రపంచానికి మార్గనిర్దేశం చేయగల దేశంగా ఎదుగుతుందని నేను ఎల్లప్పుడూ విశ్వసించాను. గత దశాబ్దకాలంగా మన దేశం ఎంతో ఉత్సాహంతో, దృఢ సంకల్పంతో పనిచేయటం నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది.

తిరువళ్లువర్ వాక్యాల సత్యాన్ని స్వయంగా మనమే వీక్షించే అవకాశం లభించింది:

"దృఢ సంకల్పంతో ఉండేవారు అనుకున్నదాన్ని ఖచ్చితంగా సాధిస్తారు".

మన దేశం శరవేగంతో పురోగమించటాన్ని మనం గమనించవచ్చు. గత దశాబ్ద కాలంలో భారత్ సాధించిన ప్రగతి యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం, అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా, వేగంగా వృద్ధి చెందుతోంది. ఈ కాలాన్ని నిరంతర అభివృద్ధి యుగంగా మార్చాలని ప్రభుత్వం, ప్రజలు కనబరుస్తున్న ఉత్సాహమే ఈ పురోగతికి కారణం. ఒకప్పుడు బలహీనమైన ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్న భారత్... నేడు ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. త్వరలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా పయనిస్తోంది. మరింత ముఖ్యమైన విషయం.. మన ఆర్థిక అభివృద్ధి సమ్మిళితత్వంతో ఉండటం.

గత దశాబ్ద కాలంలో దాదాపు 25 కోట్ల మంది భారతీయులు అత్యంత పేదరికం నుంచి బయటపడి గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నారు. భారత్‌లో నిరాశ్రయులైన పేదల కోసం ఇప్పటివరకు సుమారు 4 కోట్ల శాశ్వత ఇళ్లను నిర్మించారు. 12 కోట్లకు పైగా ప్రజలకు పైప్‌లైన్ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించారు. బహిరంగ మలవిసర్జన రహిత దేశంగా అవతరించాలని మనం ఆకాంక్షించాం. కేవలం 60 నెలల వ్యవధిలోనే దేశం... 60 కోట్ల మంది ప్రజలకు ఇది సాధ్యమయ్యేలా చేసింది.

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన ద్వారా ఏడాదికి రూ.2.3 లక్షల కోట్ల వ్యయంతో 80 కోట్ల మంది ప్రజలకు 5 కిలోల చొప్పున ఆహార ధాన్యాలు ఉచితంగా అందుతున్నాయి.

వైద్య సదుపాయాలు అందుబాటులో లేక గ్రామీణ ప్రజలు పడే బాధలను చిన్నప్పటి నుంచే చూస్తూ వచ్చాను. వారి కుటుంబాలు అనుభవించే వేదన నన్ను ఎంతో కలచివేసేది. వైద్య సదుపాయాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చూడాలనే సంకల్పంతో నేడు దేశం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తోంది. ఫలితంగా ప్రస్తుతం 44 కోట్లకు పైగా ప్రజలు పీఎంఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల బీమా రక్షణను పొందుతున్నారు. గతేడాదిలోనే ఈ పథకం ద్వారా 2.5 కోట్ల మంది ప్రజలు ఉచిత వైద్య సేవలను పొందారు.

మన రైతులు ఎంతో శ్రమించి 35 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసి, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆహార ఉత్పత్తి దేశంగా భారత్‌ను నిలిపారు. బియ్యం ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా భారత్ అవతరించటమే కాక, ఎగుమతుల ద్వారా ప్రపంచ దేశాలకు చేరువవుతోంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.4 లక్షల కోట్లకు పైగా నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ అయ్యాయి.

దేశాభివృద్ధికి మన నారీశక్తి పూర్తి సహకారాన్ని అందించేందుకు ఇప్పుడు అవకాశాలున్నాయి. 3 కోట్లకు పైగా మహిళలు లక్షాధికారి దీదీలుగా, నమో డ్రోన్ దీదీలుగా మారారు. వ్యవసాయం, విద్య, వైద్యం, సైన్స్,

టెక్నాలజీ, అంతరిక్ష సాంకేతికత వంటి ప్రతి రంగంలోనూ మహిళలు ముందుకు వచ్చారు. మహిళలకు ఇప్పుడు సాయుధ దళాల్లో శాశ్వత కమిషన్లు లభిస్తున్నాయి. యుద్ధ రంగాల్లోనూ పాల్గొంటున్నారు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో నారీ శక్తి వందన్ అధినియమ్... మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందిస్తుంది.

నేను దేశవ్యాప్తంగా పర్యటిస్తూ లఖ్‌పత్ దీదీలు, నమో డ్రోన్ దీదీలను కలిసినప్పుడు ఆ సోదరిఖల ముఖాలు ఆశలతో వెలిగిపోవటం గమనించాను. మహిళల దైనందిన జీవితాన్ని మరింత సులభతరం చేసేందుకు, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధతో దేశవ్యాప్తంగా దాదాపు 2 కోట్ల కొత్త ఎల్పీజీ కనెక్షన్లను అందించారు.

అంకుర సంస్థల ఏర్పాటు పట్ల యువతరం ఉత్సాహంతో ముందుకు రావటం చూస్తుంటే మహాకవి సుబ్రహ్మణ్య భారతి స్ఫూర్తిదాయకమైన మాటలు గుర్తొస్తాయి:

"రండి, రండి, రండి... మీరు సంకల్పించిన కార్యాన్ని సాధించండి.
దేశమంతా ఒక్క తాటిపై నిలిచి, సుసంపన్నంగా విలసిల్లాలి.
రండి, రండి, రండి... గొప్ప కార్యాన్ని సాకారం చేయండి".

యువత కోసం గత పదేళ్లలోనే 13 కొత్త ఐఐటీలు ఏర్పాటయ్యాయి. దీంతో మొత్తం ఐఐటీల సంఖ్య 23కి చేరింది. ఐఐఎంల సంఖ్య కూడా 13 నుంచి 21కి పెరిగింది. ఎయిమ్స్‌ల సంఖ్య 7 నుంచి 23కి పెరిగి మూడు రెట్లు కాగా, వైద్య కళాశాలల సంఖ్య రెట్టింపునకు పైగా 387 నుంచి 823కి పెరిగింది. వైద్య విద్యలో సీట్ల సంఖ్య 51,348 నుంచి 129,603కి పెరగటం గర్వించదగిన విషయం.

మౌలిక సదుపాయాల కల్పనలోనూ ప్రపంచ స్థాయి ప్రమాణాల దిశగా మనం దూసుకెళ్తున్నాం. దాదాపు 99 శాతం రైల్వేల విద్యుద్దీకరణ జరిగింది. దేశవ్యాప్తంగా 164 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నూతన శకానికి నాంది పలికాయి. విమానాశ్రయాల సంఖ్య రెట్టింపు అయ్యింది. ఇదివరకు 74గా ఉన్న విమానాశ్రయాలు ఇప్పుడు 163కి చేరుకున్నాయి. ఉడాన్ పథకం ద్వారా విమాన ప్రయాణం సామాన్య ప్రజలకు సైతం అందుబాటులోకి వచ్చింది.

దశాబ్దం కిందట సుమారు రూ.880 కోట్లుగా ఉన్న తమిళనాడు రైల్వే బడ్జెట్ కేటాయింపులు.. 202627 నాటికి రూ. 7,600 కోట్లకు పెరిగాయి. తమిళనాడులో రామేశ్వరం, పాంబన్ మధ్య నూతన పాంబన్ వంతెన నిర్మాణం జరగటం సంతోషకరం. భారతదేశపు మొదటి వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జి ఇది. ఆధ్యాత్మిక పర్యాటకానికి, ఆర్థికాభివృద్ధికి గొప్ప అవకాశంగా ఈ వంతెన నిలుస్తోంది. జమ్మూకాశ్మీర్‌లోని చినాబ్ వంతెన, అస్సాంలోని బోగీబీల్ వంతెనల వంటి ఆధునిక మౌలిక సదుపాయాలతో భారత్ అద్భుతాలను సృష్టిస్తోంది.

దేశాభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయిలో నాలుగు, ఎనిమిది వరుసల రహదారులతో పాటు మారుమూల గ్రామాలకు సైతం రహదారుల అనుసంధానం బలోపేతం అయ్యింది. తమిళనాడులో గత 10 ఏళ్లలో 4,000 కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది. ఈశాన్య రాష్ట్రాలలోనే గత 10 ఏళ్లలో దాదాపు 7,200 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది. ప్రగతి వేదిక ద్వారా ప్రధానమంత్రి స్వయంగా నిరంతరం పర్యవేక్షించటం వల్లనే ఈ అభివృద్ధి సాధ్యమైంది.

ప్రీ, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు... ఏకలవ్య మోడల్ వసతి గృహ పాఠశాలలు షెడ్యూల్డ్ తెగల విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చాయి.

కేవలం సామాజిక వర్గాలనే కాక, వివిధ ప్రాంతాలను కూడా కలుపుకుపోయేలా అభివృద్ధి ఉండాలని నేను ఎల్లప్పుడూ విశ్వసిస్తాను. ఒకప్పుడు భారతదేశ చివరి గ్రామాలుగా పరిగణించిన సరిహద్దు గ్రామాలు.. ఇప్పుడు ప్రాధాన్యతా గ్రామాలుగా గుర్తింపు పొంది వైబ్రంట్ విలేజెస్ పథకం ద్వారా అభివృద్ధి చెందుతున్నాయి.

ఈశాన్య రాష్ట్రాలను దేశ అష్టలక్ష్ములుగా ప్రధానమంత్రి అభివర్ణించడాన్ని నేను సంతోషంగా గుర్తుచేసుకుంటున్నా. ఇటీవల నేను నాగాలాండ్, మిజోరాం, త్రిపుర, సిక్కిం రాష్ట్రాలను సందర్శించినప్పుడు రవాణా సౌకర్యాలతో పాటు మౌలిక సదుపాయాల్లోనూ అద్భుతమైన పురోగతిని గమనించాను.

శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణల రంగాల్లో దేశం సాధించిన పురోగతి మనకెంతో గర్వకారణం. సాంకేతికత నుంచి వైద్య రంగం వరకు ప్రతీ రంగం వేగవంతమైన పురోగతిని కనబరుస్తోంది. కొవిడ్19 మహమ్మారి సమయంలో టీకాల అభివృద్ధి ప్రయత్నాల్లో భారత్ ముందడుగు వేసి, టీకాలను స్వదేశీయంగా అభివృద్ధి చేసి అత్యంత వేగంగా, ఉచితంగా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చేలా చేసింది. మానవతా దృక్పథంతో ప్రపంచవ్యాప్తంగా 100కి పైగా దేశాలకు భారత్ టీకాలను అందించింది. ఇలాంటి ప్రత్యేక చర్యలు ప్రపంచ చరిత్రలో భారత్‌కు ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయి. విజయవంతమైన చంద్రయాన్3 ప్రయోగం భారతదేశాన్ని అధునాతన అంతరిక్ష పరిశోధన యుగంలోకి తీసుకెళ్లింది. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రపంచ కంపెనీలు భారతదేశాన్ని ప్రధాన కేంద్రంగా ఎంచుకోవటం వల్ల ఎన్నో రెట్లు పెట్టుబడులు పెరిగాయి. ప్రస్తుతం సెమీకండక్టర్ల తయారీలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా మొబైల్ ఫోన్ల ఉత్పత్తిలో మనం రెండో స్థానాన్ని సాధించాం. ఒకప్పుడు మొబైల్ ఫోన్లను దిగుమతి చేసుకున్న మనం... ఇప్పుడు 300 కోట్ల డాలర్ల విలువైన మొబైల్ ఫోన్లను ఎగుమతి చేసే దేశంగా ఎదిగాం. ఈ విజయాలన్నీ రాబోయే తరాల సుసంపన్నమైన భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తాయి.

దశాబ్దాలుగా మన దేశం కేవలం ఉగ్రవాద సవాళ్లనే కాక, తిరుగుబాటు, వామపక్ష తీవ్రవాద సమస్యలను కూడా ఎదుర్కొంది. సాహసోపేతమైన విధాన నిర్ణయాలు, చట్టబద్ధమైన పాలన ద్వారా దేశంలో శాంతి నెలకొంది. తద్వారా ఆయా ప్రాంతాల్లోనూ అభివృద్ధికి మార్గం సుగమం అయింది.

2047 నాటికి, అంటే స్వాతంత్ర్యం వచ్చిన శతాబ్ద కాలంలోపే అగ్రగామి ప్రపంచ శక్తిగా భారత్ ఎదగాలని, ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే స్థానానికి చేరుకోవాలనే లక్ష్యాన్ని మనం నిర్దేశించుకున్నాం. ఎంతో శ్రమతో కూడిన ఈ కాలమే "అమృత కాలం". ప్రతి స్వాతంత్ర్య సమరయోధుడి హృదయంలో ఎలాగైతే స్వేచ్ఛాకాంక్ష ఉండేదో... నేటి యువత మనసుల్లోనూ దేశాభివృద్ధి ఆలోచనలు పెరగాలి. ఈ అమృత కాలంలో యువత ఆలోచనలు, ప్రయత్నాలు... దేశభక్తితో గొప్ప ఆదర్శాలుగా మారి, గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తులుగా ఎదిగినప్పుడే 2047లో వికసిత్ భారత్‌ను చూడగలం.

"నా సోదరులారా, మనమందరం శ్రమిద్దాం. నిద్రకు ఇది సమయం కాదు. మన ప్రయత్నాల పైనే భారతదేశ భవిష్యత్ ఆధారపడి ఉంది" అని స్వామి వివేకానంద చెప్పిన మాటలు స్ఫూర్తిని కలిగించి, దిశా నిర్దేశం చేస్తాయి.

వికసిత్ భారత్ నిర్మాణానికి మనమంతా కలిసి కృషి చేద్దాం.

## మతసామరస్యంతో పండగలు జరుపుకోవాలి: సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

- **మత పెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసిన సైబరాబాద్ సీపీ**

సైబరాబాద్ వెలుతురు మే 25:



శాంతియుత వాతావరణంలో ప్రజలంతా పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ కోరారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఈ రోజు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.

సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ ప్రజలంతా పండుగలను మత సామరస్య వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా మత పెద్దలు, ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నారని, ఎవరైనా గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ పరిధిలోని వివిధ మత పెద్దలు పాల్గొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలు శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు లో వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు గత 45 రోజులుగా పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతోందని సీపీ తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతర శాఖల అధికారులతో సమన్వయంగా పనిచేస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో వ్యాపించే ఫేక్ న్యూస్, పాత వీడియోలు, తప్పుడు ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద సమాచారం కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి మాట్లాడుతూ మత పెద్దలు చేసిన సూచనలు, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నామని తెలిపారు. భారత దేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవం, సామరస్యంతో పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పండుగ సమయంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

శేరిలింగంపల్లి డీసీపీ సీ.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి సహకారంతో పండుగలను చట్టపరంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, అసత్య ప్రచారాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎలాంటి పరిస్థితులు వచ్చినా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తారని, సమాజంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వాలంటీర్లు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో సహకరించాలని కోరారు.

కూకట్పల్లి డిసిపి రితిరాజ్ మాట్లాడుతూ పీస్ కమిటీ సభ్యులు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నాయకులుగా సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఎలాంటి అశాంతి పరిస్థితులు నెలకొనకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. పోలీసు శాఖ ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయంగా పనిచేస్తోందని తెలిపారు. సీఎంసీతో పాటు సంబంధిత శాఖల సహకారంతో బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఈ పీస్ కమిటీ సమావేశంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ఎస్‌బి డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి సైబరాబాద్ పరిధి లో స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, పలువురు హిందూ, ముస్లిం మత పెద్దలు మరియు నాయకులు పాల్గొన్నారు.

## మే 27 నుంచి పాలిసెట్ కౌన్సిలింగ్‌కు సిద్ధం..

### ఫీజుల రీయంబర్స్మెంట్‌పై స్పష్టత తర్వాతే నిర్వహించాలని డిమాండ్

- **ఫీజుల రీయంబర్స్మెంట్ పై స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వం కౌన్సిలింగ్ చేపట్టడం సరికాదు**
- **పాత పద్ధతిలోనే ఫీజుల రీయంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయాలి.**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్**

హైదరాబాద్ వెలుతురు మే 25:



ఫీజుల రీయంబర్స్మెంట్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత లేకుండానే ఈనెల 27వ తేదీ నుండి పాలిసెట్ కౌన్సిలింగ్ చేపడుతుందని,పాత పద్ధతి ప్రకారమే ఫీజుల రీయంబర్స్మెంట్ ను అమలు చేస్తామని ప్రకటించిన తర్వాతనే కౌన్సిలింగ్ చేపట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు విడుదల చేయకుండా గత ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని,కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయంబర్స్మెంట్ పథకాన్నీ నీరుగార్చే విధంగా వ్యహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సొంత చెల్లి, బావ ఫోన్‌లు కూడా ట్యాప్ చేసిన కేటీఆర్ కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదు



- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
- **ఇందిరమ్మ ఇండ్లపై కేటీఆర్ కు మంత్రి పొంగులేటి సవాల్**
- **X లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్ వెలుతురు మే 25:

సొంత చెల్లి, బావ ఫోన్‌లు కూడా ట్యాప్ చేసిన కేటీఆర్ గారికి ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదు అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నాం. ఇందిరమ్మ పాలన అంటే ఏంటో గ్రామాల్లోకి వెళ్లి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుంది కేటీఆర్ గారు.

**ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుంది?**

జూన్ 1న మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి గారు శ్రీకారం చుట్టనున్నారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని మే 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించాం.

రాజకీయ సన్యాసం తీసుకుంటా అంటున్న డ్రామారావు గారు... అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని ఓడగొట్టి, లోక్‌సభ ఎన్నికల్లో మీకు సున్నా సీట్లు ఇచ్చి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాల్లో కూడా మిమ్మల్ని ఓడగొట్టిన ప్రజలంతా.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు VRS ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

**మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదు!**

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదు. డబుల్ బెడ్ రూం ఇండ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఓట్లు అడగకూడదు. సవాల్‌కు సిద్ధమేనా కేటీఆర్ గారు?

## పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యం బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చును

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 25:



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ ఆవరణలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాలులో న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పోషకాహార మేళ లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్ లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుండి ప్రదర్శించిన పలు పదార్థాలను రుచి చూసి చాలా బాగున్నాయని తెలిపారు. అంగన్వాడీ ద్వారా గర్భిణులకు ఈ విధమైన పౌష్టికారాన్ని అందించాలని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6వ తేదీ నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో ఇప్పటి వరకు ప్రతి వారం ఒక్కో థీమ్ తో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇప్పటి వరకు నిర్వహించిన థీమ్ లను కింది స్థాయి నుండి పై అధికారి వరకు అందరూ సమర్థవంతంగా పని చేసి విజయవంతం చేయడం జరిగింది. అదే విధంగా నేటి (సోమవారం) నుండి ప్రారంభమయిన మహిళా వారోత్సవాలను కూడా అందరూ సమిష్టిగా పని చేసి విజయవంతం చేయాలని సూచించారు. మనం నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధుల బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోగలుగుతామని అన్నారు. సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. అంగన్ వాడి టీచర్లు గ్రామీణస్థాయి మహిళలకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం గర్భిణీ మహిళలకు, శిశు సంక్షేమం కోసం అంగన్వాడీ ద్వారా పలు పోషక విలువలు కలిగిన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుంది. పోషకాహార మేళ ను ప్రజలకు, అధికారులకు ఒక అవగాహన కల్పించడం కోసం నిర్వహించడం జరిగిందని అన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ మన శరీరం మనం ఉన్నంత వరకు ఉంటుంది. అందుచేత మనం మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలని, నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని, తద్వారా మనకు ఏవిధమైన వ్యాధులు దరి చేరకుండా ఉంటామని అన్నారు.

మహిళా వారోత్సవాలలో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్ ఎగ్జిబిషన్, అంగన్వాడీ లబ్ధి దారులు, తల్లితండ్రుల చేత వంటలపోటీలు నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు న్యూట్రిషన్ ఫుడ్ పైన అవగాహన కలిగిస్తూ స్టాల్స్ నందు తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, కూరగాయలు మరియు పండ్లుకు సంబందించిన ఆహార పదార్థాలను స్టాల్ లో ప్రదర్శనకు పెట్టడం జరిగింది. జంక్ ఫుడ్ యొక్క దుష్ప్రభావాలు మరియు న్యూట్రిషన్ ఫుడ్ యొక్క లాభాలను వివరిస్తూ చాట్స్ ని ప్రదర్శించడం జరిగింది. హెల్త్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో గర్భిణి బాలింతలు మరియు కిశోర బాలికలకు రక్త హీనత పరీక్షలు నిర్వహించడం జరిగినది. గర్భిణి బాలింతలకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు, వంటల పోటీలలో గెలుపొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగినది.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, పిడి డిఆర్డిఓ/డిడబ్ల్యూఓ శ్రీలత, సిపిఓ సౌమ్య, GM Industries శ్రీలక్ష్మి, Adult ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, పిడి మెప్మా, సిడిపిఓ శాంతి కుమారి, 7 ప్రాజెక్టు ల సిడిపిఓ లు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, మరియు DWO సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆరుట్లలో గ్రామ సంఘం శంకుస్థాపన కార్యక్రమం

: గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్
ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్



మంచాల వెలుతురు మే 25:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో గ్రామ సంఘం నూతనంగా భవన నిర్మాణానికి శంకు స్థాపన చేసిన అరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ ఈ కార్యక్రమంలో గ్రామపంచాయితీ వార్డు సభ్యురాలు లాలగారి మన్నెమ్మ ఆరుట్ల క్లస్టర్ గ్రామ సంఘం ఈసీ సభ్యులు వివోఎలు రజిత జ్యోతి సంతోష రుద్ర సుమలత అరుణ మరియు యా దయ్య సిసి తదితరులు పాల్గొన్నారు

# నేస్తం సంస్థకు ప్రతిష్టాత్మక ఎన్టీఆర్ అవార్డు

నార్కట్ పల్లి వెలుతురు మే 25

నేస్తం వాలంటరీ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. టీ. జీ. లింగం గౌడ్ కు ప్రతిష్టాత్మక ఎన్టీఆర్ అవార్డు వరించింది. కళావేదిక 60 వసంతాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పురస్కార కార్యక్రమంలో భాగంగా ఈ అవార్డుకు డా. టీజీ లింగం గౌడ్ ఎంపికైనట్లు భువన రాయవరపు ప్రకటించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్‌గా, సామాజిక సేవా కార్యక్రమాలద్వారా విశేషగుర్తింపు పొందిన డా.టీజీలింగం గౌడ్‌కు ఈ అవార్డును సినీ ప్రముఖులసమక్షంలో ఈనెల 28052026న అమీర్‌పేట్‌లోని ఏఏఏ సినిమా థియేటర్‌లో అందజేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని మూవీ ప్రొడ్యూసర్ R. V. రమణ మూర్తి కుమార్తె ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళావేదిక మ్యాగజైన్ అధినేత భువన రాయవరపు మాట్లాడుతూ,సామాజిక సేవలోనేస్తం సంస్థ చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని అభినందించారు.

# మోత్కూర్ చెరువు కట్ట రోడ్డు మరమ్మత్తు మరిచారా?

మోత్కూర్, మే 25,వెలుతురు న్యూస్

గత సంవత్సరం సెప్టెంబర్ మాసం లో ఎడతెరపి లేకుండా కురిసిన అధిక వర్షాల వల్ల మోత్కూర్ నుండి తిరుమలగిరి కి వెళ్లే ప్రధాన రహదారి అయిన మోత్కూర్ చెరువుకట్ట రోడ్డు కుంగిపోయింది. రోడ్డు కుంగినప్పుడు అధికారులు సకాలంలో స్పందించినప్పటికీ అధిక వర్షాల వల్ల రోడ్డు మరమ్మత్తుకు పోసిన మట్టి మొత్తం జారిపోయి నిలువలేదు. కట్టకు నీటి బుంగ పడి మట్టి నిలవడం లేదేమో అని అధికారుల సూచన మేరకు చెరువుకు గండిపెట్టి అధిక మొత్తంలో నీటిని కూడా తొలగించారు. అయినా కానీ పోసిన మట్టి నిలవకుండా రోడ్డు మరమ్మత్తుకు వీలు పడలేదు. చెరువులో నీరు అధికంగా ఉన్నప్పుడు రోడ్డును బాగు చేయలేమని నీరు తగ్గాక ఎండాకాలం అయితే సరైన సమయం అని బారికేడ్లు, లైట్ లు పెట్టి వాయిదా వేశారు.అయితే ప్రస్తుతం కొన్ని రోజుల నుండి చెరువులో నీరు చాలా వరకు తగ్గి పోయింది. ఎండాకాలం కూడా కొన్నిరోజులలో గడిచి పోతుంది.వర్షాకాలం జూన్ నెలలో రానున్న నేపథ్యంలో ఇప్పుడు ఉన్న రోడ్డు కూడా వర్షాలకు కుంగిపోతే కొండగడప,కాశవారి గూడెం, డాబంగ్లా ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు.కావున అధికారులు




వర్షాకాలం రాకముందే చెరువు కట్ట రోడ్డు ను మరమ్మత్తు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసిడిపిఓ సమీరా

### గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

రామన్నపేట వెలుతురు న్యూస్ మే 25:

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని రామన్నపేట ఎసీడీపీవో సమీరా అన్నారు. రామన్నపేట మండల కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ సి డి పి ఓ సమీరా గర్భిణీలు, బాలింతలకు న్యూట్రిషన్ పై అవగాహన కల్పించారు.గర్భవతులు బాలింతలు ఆరోగ్య సూచనలు పాటించాలని సూచించారు. అనంతరం తల్లులకు ఫుడ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ హేమలత, ఏఎన్ఎంలు సాదియా, మంజుల, అంగన్వాడి టీచర్లు, ఆశాలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



# బీటీ రోడ్లను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కు వినతి పత్రం

- **తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహ**

రామన్నపేట వెలుతురు న్యూస్ మే 25

నకిరేకల్ శాసనసభ్యులు తెలంగాణ ప్రభుత్వ విప్ వేముల వీరేశం ని హైదరాబాద్‌లో కలిసి, పెద్దకాపర్తి నుండి సిరిపురం వరకు, అలాగే వెలిమినేడు నుండి సిరిపురం మీదుగా ఇంద్రపాలనగరం వరకు ఉన్న రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రహదారులు అభివృద్ధి చెందితే సిరిపురం గ్రామానికి పరిసర గ్రామ ప్రజలకు మరియు సిరిపురం చేనేత పరిశ్రమకు కొత్త ఊపిరి లభించడమే కాకుండా, పరిసర గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన వివరించారు. సిరిపురం గ్రామం దశాబ్దాలుగా చేనేత రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన గ్రామమని, ప్రస్తుతం ఈ ప్రాంతం నుంచి కోట్ల రూపాయల విలువైన చేనేత ఉత్పత్తులు మార్కెట్‌కు చేరుతున్నాయని తెలిపారు. అయితే సరైన రోడ్డు సదుపాయం లేకపోవడం వల్ల పరిశ్రమ అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నుండి విజయవాడ హైవేకు కేవలం 6 కిలోమీటర్ల సమీపంగా ఉన్న సిరిపురం చేనేత పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉందని... ఈ రోడ్లు నిర్మితమైతే వందలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని వినతి పత్రంలో వివరించారు. ఇట్టి విషయం విన్న ఎమ్మెల్యే తప్పకుండా ఈ రోడ్లు ఏర్పాటు చేస్తానని. హామీ ఇచ్చారు.



# న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ ను చంపిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

- **ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి**

రామన్నపేట వెలుతురు న్యూస్ మే 25

హైదరాబాదులో న్యాయవాది ఖాజా మొయిజుద్దిన్ పై పథకం ప్రకారం కారు తో దాడి చేసి హత్య చేసిన దుండగుల ను వారి వెనుక ఉన్న రాజకీయ నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదిపై ముందు నుండే బెదిరింపులు, దాడుల నేపథ్యంలో పోలీసులు సరైన భద్రత అందించలేదని ఇది విచారకరమని మరణించిన న్యాయవాది కుటుంబ సభ్యులకు ప్రభుత్వము తగినంత భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు కోరారు. న్యాయవాద రక్షణ చట్టం అమలులోకి వచ్చినప్పటికీ న్యాయవాదులపై దాడులు కొనసాగుతున్నయని, ఇవి పెరిగి పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఏఐఎల్‌యూ ప్రగాఢమైన సానుభూతి తెలియజేసింది. ఒక న్యాయవాదిపై వ్యక్తిగతంగా దాడి చేసి చంపితే న్యాయం దొరుకుతుందని కొంతమంది అనుకుంటున్నారని వ్యక్తులను చంపితే న్యాయం అన్యాయమైపోదని వారు అన్నారు. న్యాయవాదులపై దాడి చేయాలని సంస్కృతికి ముగింపు పలకాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ యాదాసు యాదయ్య, ఐలు జిల్లా ఉపాధ్యక్షులు పాల్వంచ జగతయ్య, గడ్డం నర్సయ్య జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్, నల్లా కనెక్షన్ పర్మిషన్‌పై కలెక్టర్‌కు పిర్యాదు

- **వడ్డేపల్లి నాగరాజు బీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు**

నార్కట్ పల్లి వెలుతురు మే 25

భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ను భీమ్ ఆర్మీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు కలిసి వినతి పత్రం అందజేశారు.నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని ఓల్డ్ ఎస్సీ కాలనీలో ఖాళీ స్థలానికి ఎలాంటి నిర్మాణం లేకుండానే ఇంటి నెంబర్ మరియు నల్లా కనెక్షన్‌కు అనుమతులు ఇచ్చారని, దీనిపై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి మరియు బిల్లు కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి నాగరాజు మాట్లాడుతూ, మున్సిపాలిటీ మరియు గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం కనీసం బేస్‌మెంట్ (ప్లింత్ లెవల్) లేదా గోడల స్థాయి వరకు పూర్తయిన తర్వాత మాత్రమే అధికారులు పరిశీలించి ఇంటి నెంబర్ కేటాయిస్తారని తెలిపారు. ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్ మంజూరు చేయడం పూర్తిగా చట్ట విరుద్ధమని అన్నారు. ఓల్డ్ ఎస్సీ కాలనీలోని ఖాళీ స్థలానికి సిలివేరు కల్పన భర్త వెంకటరమణ పేరుపై ఇంటి నెంబర్ మరియు నల్లా కనెక్షన్‌కు పర్మిషన్ ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ నిబంధనలు పాటించకుండా అనుమతులు ఇచ్చిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయంపై స్పందించిన జిల్లా కలెక్టర్, సంబంధిత అంశాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని ఎంఆర్వో అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.



# కనుల పండువగా శ్రీ పట్టాభి సీతారాముల మాసకళ్యాణం

నార్కట్ పల్లి వెలుతురు మే 25

నార్కెట్‌పల్లి మండలం మాండ్ర గ్రామ శివారులోని అనంత స్వర్గగిరి శ్రీ పట్టాభి సీతారాముల దేవాలయంలో సోమవారం నాడు మాసకళ్యాణ మహోత్సవం కనుల పండువగా ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు ఉంద్ర లింగారెడ్డి - భాగ్యమ్మ దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు ఉత్తరపల్లి మణికంఠాచార్యులు, పౌరోహితులు ఉత్తరపల్లి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి, అనంతరం స్వామివారికి మరియు అమ్మవారికి పంచామృతాభిషేకం, నూతన పట్టువస్త్రాల సమర్పణ, పాదప్రక్షాళన, మద్దుపర్కం, జీలకర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వడిబియ్యం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాట వెంకన్న - రాణమ్మ దంపతులు, క్రిష్ణరెడ్డి లింగయ్య - పద్మ దంపతులతో పాటు మాండ్ర, తిరుమలగిరి, కక్కిరేణి, చిన్న తమ్మలగూడెం, నెమ్మాని, జువ్విగూడెం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.




# సేవా తత్పరులంతా రెడ్ క్రాస్ లో చేరాలి



- **ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్**
- **డాక్టర్ జి లక్ష్మి నరసింహ రెడ్డి.**

మోత్కూర్, మే 25,వెలుతురు న్యూస్

సేవా తత్పరులంతా అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ అయిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. జూన్ నెల 15 వరకు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మోత్కూరు సిఐ వెంకటేశ్వర్లకు శాశ్వత సభ్యత్వ కార్డును అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సభ్యత్వ నమోదు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భువనగిరిలోని తమ కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా డాటా సెంటర్ ను ఏర్పాటు చేసి సభ్యత్వాలను స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. సమాజ సేవ చేయాలనుకుంటున్న వారంతా రెడ్ క్రాస్ లో చేరి స్వచ్ఛత కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పేదలకు, ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ఆపదలో ఉన్న వారికి సేవ చేసే అవకాశం రెడ్ క్రాస్ కల్పిస్తుందని పేర్కొన్నారు. రక్తదానాన్ని ప్రోత్సహించడంలో, ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించడంలో రెడ్ క్రాస్ సంస్థ ముందుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా డైరెక్టర్ కె ప్రభాకర్ రెడ్డి, పి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఎన్ చారి, యూత్ వింగ్ జిల్లా అధ్యక్షుడు బిసు మచ్చగిరి. మాజీ సర్పంచ్ చేతరాషి అంజయ్య, ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళనలో అప్రమత్తత అవసరం

- **-బీజేపీ నియోజకవర్గ బి.ఎల్.ఓ.**
- **మేడబోయిన యాదగిరి.**

మోత్కూర్, మే 25,వెలుతురు న్యూస్

డబల్ ఓటర్లు మరియు అనధికారిక ఓటర్లు వలసవాదుల నుండి అప్రమత్తంగా ఉండాలని బిజెపి తుంగతుర్తి నియోజకవర్గ బిఎల్ఓ మేడబోయిన యాదగిరి అన్నారు. సోమవారం నాడు మోత్కూర్ లో బూత్ స్థాయి బి ఎల్ ఓ లతో సమావేశం లో మాట్లాడారు.కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చినటువంటి ఓటర్ జాబితా ప్రక్షాళన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(SIR) దేశంలో దాదాపు 13 రాష్ట్రాల్లో పూర్తయిందని,2002నుంచి 2005 వరకు గతంలో SIR అమలు చేసి ఓటరు జాబితాను ప్రభుత్వాలు ప్రక్షాళన చేశాయని,ప్రతి బూతులో బిజెపి తరపున ఇద్దరు బిఎల్ఓలు ప్రభుత్వ బిఎల్వోల తో సమన్వయం చేసుకుంటూ అర్హులైన ఓటర్లని జాబితాలో చేర్పించాలని,ప్రజలను చైతన్యపరిచి చనిపోయిన మరియు డబల్ ఓటర్లు మరియు అనధికారిక ఓటర్లు వలసవాదుల నుండి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.బిజెపి బి ఎల్ ఓల సమావేశానికి పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, చేకూరు మల్లేష్, పట్టణ ఉపాధ్యక్షులు కందుకూరి ప్రకాష్,ప్రధాన కార్యదర్శులు జినకల దశరథ, అన్నపు సత్యనారాయణ, కార్యదర్శి తీగల శ్రీధర్ గౌడ్,వనం రేణుక,బద్దం మహేందర్ రెడ్డి, గొడుగు చంద్రమౌళి,దండబోయిన అంజయ్య తదితరులు పాల్గొన్నారు



# మహిళల ఆర్థిక స్వలాంబనకు సంఘాలే బలమైన వేదిక





- స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి...
- మానియార్‌పల్లి గ్రామ సర్పంచ్ బ్యాగారి రాజ్ కుమార్...
- సెర్ప్ ప్రత్యేక జనరల్ బాడీ సమావేశంలో మహిళలకు అవగాహన

జహీరాబాద్ వెలుతురు, మే 25

మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబ అభివృద్ధికి తోడ్పడాలని మానియార్‌పల్లి గ్రామ సర్పంచ్ బ్యాగారి రాజ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కోహీర్ మండలంలోని మానియార్‌పల్లి గ్రామంలో గ్రామ సంఘాల ప్రత్యేక జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా సంఘాల సభ్యులకు సెర్ప్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బ్యాంక్ లింకేజీ, జీవనోపాధి అవకాశాలు, పౌష్టికాహార కార్యక్రమాలు, మహిళల భద్రత, మౌలిక వసతుల కల్పన, కొత్త సంఘాల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే కిశోర బాలికల సంఘాలు, వృద్ధుల సంఘాలు, పీడబ్ల్యూడీ సంఘాలు, మహిళా సంఘాల బలోపేతం, పీఎంఎఫ్ఎంఈ పథకం, మునగ తోటల పెంపకం ద్వారా ఆదాయ వనరులు పెంపొందించుకునే మార్గాలను సభ్యులకు వివరించారు. మహిళలు చిన్న స్థాయి పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సర్పంచ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, మహిళలు సంఘాల ద్వారా ఐక్యంగా పనిచేస్తే ఆర్థిక స్వలాంబన సాధ్యమవుతుందని తెలిపారు. మహిళలు తమ సమస్యలను నిర్మొహమాటంగా సంఘాల ద్వారా ముందుకు తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిత, గ్రామ వార్డు సభ్యులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ తులసి, అంగన్వాడీ టీచర్లు, ఐకేపీ సీసీ నర్సింలు, విఓఏలు అనంతయ్య, మల్లేశం, విఓ ఓబిలు మరియు గ్రామంలోని వివిధ సంఘాల మహిళా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్పంచ్ అన్నం మల్లేష్ బర్త్ డే వేడుకల్లో పాల్గొన్న సురిగి నరసింహ గౌడ్



హైదరాబాద్ వెలుతురు మే 25:
మల్లారెడ్డిగూడెం సర్పంచ్ అన్నం మల్లేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, లారీల సంఘం అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్, కార్యదర్శి కట్ట లింగస్వామి, లీగల్ అడ్వైజర్, హైకోర్టు అడ్వకేట్ ఏశాల శ్రవణ్ కుమార్ పాల్గొని మల్లేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్ – మంత్రి దామోదర రాజనర్సింహ






- ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత – మంత్రి కొండా సురేఖ

సంగారెడ్డి, వెలుతురు మే,25





అడవుల నరికివేత, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసు కుంటున్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రూ.1.44 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీశాఖ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర మంత్రులు శ్రీ దామోదర్ రాజనర్సింహ, శ్రీమతి కొండా సురేఖ గార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలో "అమృతవనం", "హరిత వనం" పేర్లతో రెండు ఆధునిక ఎకో పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. సంగారెడ్డి, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్పందన ఆధారంగా 'నైట్ స్టే' సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, రిజర్వ్ ఫారెస్టుల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అందించగలమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, మరియు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రకృతి వనాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వద్ద ఏర్పాటు చేసిన అమృతవనం, హరితవనం వంటి ఎకో పార్కులు ప్రజలకు ప్రకృతి సౌందర్యాన్ని చేరువ చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, జిల్లా అటవీశాఖ అధికారి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదు

- - కేటీఆర్ తెలంగాణ మొత్తం తిరిగి చూడొచ్చు
- - డబుల్ బెడ్రూం లేని ఊర్లు మేం చూపిస్తాం
- - ఇందిరమ్మ ఇల్లు ఉన్న గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగొద్దు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- - కేటీఆర్‌కు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్
- - 2.5 లక్షల కొత్త ఇళ్లకు శ్రీకారం: మంత్రి ప్రకటన

హైదరాబాద్ వెలుతురు మే 25



బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని, అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఓట్లు అడగకూడదని ఆయన వ్యాఖ్యానించారు. ఇళ్ల పథకాలపై రెండు పార్టీల మధ్య రాజకీయ వాగ్వాదం మరింత ఉధృతమైంది.

### గ్రామాల స్థాయిలో రాజకీయ షరతులు

మంత్రి పొంగులేటి వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ ప్రారంభమైంది. ఇళ్ల పథకాలను కేంద్రంగా చేసుకుని గ్రామాల స్థాయిలో రాజకీయ షరతులు విధించడం ద్వారా ప్రజల దృష్టిని ప్రభుత్వ పనితీరు వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి అత్యంత కీలక అవసరం కావడంతో ఈ అంశం రాజకీయంగా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

### ప్రజలే నిర్ణయిస్తారు: మంత్రి

పొంగులేటి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల హామీ అమలులో విఫలమైందని విమర్శించారు. పేదలకు ఇళ్లు అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సరైన ప్రణాళికలు రూపొందించలేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు గృహ సదుపాయం కల్పించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు.

### 2.5 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

మంత్రి ప్రకటించిన ప్రకారం, జూన్ 1న రాష్ట్ర వ్యాప్తంగా మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహ సమస్యను తగ్గించడమే ఈ పథక లక్ష్యమని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అంతేకాకుండా హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. నగర ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా, గృహ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

### 4.5 లక్ష ఇళ్ల లక్ష్యం

అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో మొత్తం 4.5 లక్షల ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పొంగులేటి తెలిపారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయడానికి అవసరమైన నిధులు, భూమి కేటాయింపులు, పథక అమలు విధానాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. పేదలకు గౌరవప్రదమైన జీవితం అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

### కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు

బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై మంత్రి పొంగులేటి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని ప్రస్తావిస్తూ, "చెల్లి, బావ ఫోన్లు ట్యాప్ చేసిన కేటీఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత లేదు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణలో ఇళ్ల పథకాలు ప్రస్తుతం ప్రధాన రాజకీయ అంశంగా మారాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన డబుల్ బెడ్‌రూమ్ పథకం పూర్తి స్థాయిలో అమలు కాలేదని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కూడా సమర్థవంతంగా అమలు అవుతుందా లేదా అన్న చర్చ కొనసాగుతోంది. ఇళ్ల పథకాలు కేవలం అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా రాజకీయ విమర్శలకు కేంద్ర బిందువుగా మారడం గమనార్హం. గ్రామాల స్థాయిలో పేదల గృహ సమస్యలు నేరుగా రాజకీయ ప్రభావాన్ని చూపుతున్నాయి.

### కేటీఆర్-పొంగులేటి మధ్య మాటల యుద్ధం

ఈ తాజా వ్యాఖ్యలతో కేటీఆర్, పొంగులేటి మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రతరం అయింది. బీఆర్ఎస్ వర్గాలు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను రాజకీయ ప్రచారంగా వాడుకుంటోందని విమర్శిస్తుండగా, కాంగ్రెస్ నాయకులు మాత్రం గత ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తున్నారు. రైతు సమస్యలు, ఉద్యోగాలు వంటి అంశాలతో పాటు గృహ సమస్య కూడా రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారుతోంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇల్లు అనేది అత్యంత ప్రధాన అవసరం కావడంతో ఈ అంశంపై ప్రజల స్పందన రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కొత్త వివాదానికి దారి తీసింది. కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చేసిన సవాల్‌తో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఇళ్ల నిర్మాణాల హామీలు, వాటి అమలు తీరు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారనున్నాయి.

# జర్నలిస్టే కాదు క్లే ఆర్టిస్ట్ కూడ జన పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ ఆయన తపన







హైదరాబాద్ వెలుతురు మే 25

పర్యావరణ పరిరక్షణకు ప్రజలు మరింతగా మద్దతు తెలుపుతున్న ఈ కాలంలో మట్టి వినాయక విగ్రహాల తయారీకి విశేష ఆదరణ లభిస్తోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి కాలుష్యం పెరుగుతుండటంతో, సహజసిద్ధమైన మట్టితో తయారయ్యే వినాయక విగ్రహాల వైపు భక్తులు మొగ్గు చూపుతున్నారు. సంప్రదాయ కళకు ఆధునిక ఆలోచనల జోడింపుతో కళాకారులు ఆకర్షణీయమైన మట్టి గణపతులను రూపొందిస్తున్నారు. పర్యావరణ హితంగా ఉండటమే కాకుండా, ప్రకృతితో మమేకమయ్యే సందేశాన్ని ఈ మట్టి వినాయక విగ్రహాలు సమాజానికి అందిస్తున్నాయి. జన పరిరక్షణ తో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం.నేను సైతం అంటూ ముందుంటున్నారు. మట్టి గణపతే మహా గణపతి అంటున్న జర్నలిస్ట్ కమ్ క్లే ఆర్టిస్టు రామకృష్ణ ప్రతి ఏడాది వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతుల తయారీకి సన్నద్ధం అవుతారు అందులో భాగంగా ఉచితంగా పిల్లలకు శిక్షణ ఇస్తారు. గత 21 ఏళ్ల నుంచి ఆయన పర్యావరణ పరిరక్షణ యజ్ఞం చేస్తున్నారు. జర్నలిస్ట్ గా నిరంతరం అన్ని వర్గాలు వ్యక్తులతో వృత్తి పరమైన పోరాటం చేస్తూనే రామకృష్ణ పర్యావరణ పరిరక్షణ కు చేస్తున్న కృషి అమోఘం. ఆయన కృషిని పలువురు ప్రముఖులు, కేంద్ర మంత్రులు,ఎంపీలు ప్రశంసలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఆయన తపన పడుతున్నారంటు కొనియాడుతున్నారు. ప్రతి ఏడాది వినాయక చవితి పండగ సందర్భంగా అందమైన మట్టి గణపతులను తయారు చేసే కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు పిల్లలను కూడా ఇందులో భాగస్వామ్యులను చేస్తున్నారు. విగ్రహాల తయారీని పిల్లలకు ఉచితంగా నేర్పిస్తున్నారు. బొమ్మలు తయారు చేయడం ఆయన వృత్తి కాకపోయినా ,ప్రవృత్తిగా ఎంచుకున్నారు.విశాఖ పట్నం కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ రామకృష్ణ కు చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం, బొమ్మల తయారీ అంటే మక్కువ ఈ నేపథ్యంలో వినాయక విగ్రహాలు తయారీపై మక్కువ పెంచుకున్నారు. ఊహ వచ్చినప్పటి నుంచి మంచి మంచి బొమ్మలు వేయడం చేశారు అలాగే మట్టితో విగ్రహాలను తయారు చేయడం అలవాటుగా మార్చుకున్నారు. కేవలం గణేష్ విగ్రహాలను తయారు చేయడమే కాకుండా వాటిని ఎలా తయారుచేయాలో కూడా అందరికి నేర్పిస్తున్నారు. మేకింగ్ గణేషా వీడియోలను తయారు చేసి వాటిని యూట్యూబ్ లో పెట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గత 21 ఏళ్ల నుంచి ఎంతో మంది పాఠశాల విద్యార్థులకు,పిల్లలకు విగ్రహాల తయారీలో ఉచిత శిక్షణ ఇచ్చారు. దీంతో చాలా మంది చిన్నారులు తమ స్వహస్తాలతో అందమైన మట్టి గణపతి విగ్రహాలను తయారు చేయడమే కాదు, వాటిని వినాయక చవితి పండగ రోజున పూజించుకోవడం పరిపాటిగా మారింది. అలాగే ప్రతి ఏడాది వినాయక చవితి పండగ సందర్భంగా మట్టి విగ్రహాలను తయారు చేసి బంధువులకు, స్నేహితులకు రామకృష్ణ ఇస్తుంటారు. రామకృష్ణ చేసిన అందమైన మట్టి గణపతులపై ప్రముఖుల నుంచి ఎన్నో ప్రశంసల జల్లు కురిసింది. 2024 విశాఖలో ఆర్కే బీచ్ వద్ద కోణార్క్ చక్రం వద్ద మట్టి గణపతి ని ఎలా తయారు చేయవచ్చో అద్భుతమైన ఒక వీడియోను రామకృష్ణ చేశారు..ఈ వీడియోకు కేంద్ర, రాష్ట్ర మాజీ మంత్రులు, పలువురు రాజకీయ ప్రముఖుల నుంచి ప్రశంసలు వచ్చాయి. రామకృష్ణ చేసిన గణేష్ మేకింగ్ వీడియో బాగా నచ్చడంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ తన ఎక్స్ ఖాతాలోను, ఫేస్ బుక్ లోను ఈ వీడియోను పోస్టు చేశారు. అంతేకాదు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, అనకాపల్లి ప్రస్తుతం ఎంపీ సిఎం రమేష్ కూడా రామకృష్ణ చేస్తున్న కృషి అభినందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం రామకృష్ణ చిన్నారులకు మట్టి గణపతులను నేర్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన ఫోటోలను ఫోటోలను కూడా సీఎం రమేష్ తన ఎక్స్ ఖాతాలో స్వయంగా పోస్టు చేసి ఆయనను ప్రోత్సహించారు. ప్రతి ఏడాది వినాయక చవితి రోజున గణనాథుడ్ని పూజించడానికి చాలా విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసేవారు. ఇటువంటి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తే పర్యావరణకు హానికరం. నీటిలో ఉండే జీవులతో పాటు ఆ నీటిని తాగే మనకు కూడా అనారోగ్యం కలుగుతుంది. ఈ ముప్పు నుంచి తప్పించడానికి, పర్యావరణ పరిరక్షణ కోసం ఆయన బాధ్యత తీసుకున్నట్లు చెబుతున్నారు. అందుకే తన కళ ద్వారా మట్టి గణపతులను తయారు చేసి పర్యావరణాన్ని కాపాడుతున్నానని చెబుతున్నారు. అందుకే ప్రతి ఏడాది ఒక యజ్ఞం లాగామట్టి గణపతులను తయారు చేస్తున్నానని,వాటిని పిల్లలకు ఉచితంగా నేర్పిస్తున్నాని తెలిపారు.భవిషత్తులో కూడా ఈ కార్యక్రమం నిరాంతరాయంగా కొనసాగుతుందని రామక్రిష్ణ పేర్కొన్నారు. వృత్తి పరమైన సవాళ్ళను ఎదురు కుంటూనే జర్నలిస్ట్ రామక్రిష్ణ పర్యావరణ పరిరక్షణ కోసం పరితపించటం మాత్రం గొప్ప విషయమని చెప్పచ్చు

# వెకిలినవ్వుపై ప్రజాగ్రహం

- - కోయంబత్తూరు బాలిక హత్యాచారం కేసు వివాదాస్పదం
- - విలేకరుల సమావేశంలో పోలీసు అధికారుల నవ్వు వీడియో వైరల్
- - సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం
- - వివరణ ఇచ్చిన ఐజీపీ ఆర్‌వీ రమ్య భారతి

కోయంబత్తూరు వెలుతురు మే 25



తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో జరిగిన బాలిక హత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. అత్యంత సున్నితమైన ఈ కేసు నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు నిర్వహించిన విలేకరుల సమావేశం ఇప్పుడు మరో వివాదానికి దారితీసింది. సమావేశంలో కొందరు అధికారులు నవ్వుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై నెటిజన్లు, సామాజిక వేదికల వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం కోరుతూ జరుగుతున్న చర్చల మధ్య ఇలాంటి ప్రవర్తన అసమంజసమని వారు పేర్కొంటున్నారు. పోలీసు శాఖ వంటి బాధ్యతాయుత వ్యవస్థలో ఉన్న అధికారులు ఇలాంటి సున్నిత సందర్భాల్లో మరింత గంభీరంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. కోయంబత్తూరు నగరంలో ఒక బాలికపై జరిగిన హత్యాచారం ఘటన రాష్ట్రాన్ని మాత్రమే కాకుండా దేశాన్ని కూడా కుదిపేసింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడించేందుకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కేసు తీవ్రత దృష్ట్యా సమాజంలో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమవుతోంది.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు, మహిళా సంఘాలు కూడా ఈ ఘటనపై స్పందిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

### విలేకరుల సమావేశంలో చోటు చేసుకున్న ఘటన

ఈ కేసుకు సంబంధించి కోయంబత్తూరు వెస్ట్ జోన్ ఐజీపీ ఆర్‌వీ రమ్య భారతి, డీఐజీ పి. సామినాథన్, ఎస్పీ అల్లటిపల్లి పవన్ కుమార్ రెడ్డి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. కేసు వివరాలు వెల్లడించే క్రమంలో ఐజీపీ తన సహచర అధికారులతో మాట్లాడుతూ నవ్విన దృశ్యాలు కెమెరాల్లో నమోదయ్యాయి. ఈ వీడియో క్షణాల్లోనే సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అత్యంత సున్నితమైన కేసు గురించి చర్చ జరుగుతున్న సమయంలో ఉన్నతాధికారులు నవ్వడం అనుచితమని నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. బాధిత కుటుంబం ఎదుర్కొంటున్న వేదనను పట్టించుకోకుండా ఇలా ప్రవర్తించడం సరైనదికాదని వ్యాఖ్యలు వెల్లువెత్తుతున్నాయి.

### సోషల్ మీడియాలో తీవ్ర ప్రతిస్పందన

ఈ వీడియో బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ ప్రారంభమైంది. చాలా మంది వినియోగదారులు పోలీసుల ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇలాంటి సున్నిత ఘటనల్లో అధికారులు మరింత బాధ్యతగా ఉండాలి" అని ఒకరు వ్యాఖ్యానించగా, "ఇది అధికార దుర్వినియోగం కాకపోయినా బాధ్యత లేమి" అని మరొకరు పేర్కొన్నారు. కొంతమంది నెటిజన్లు ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ప్రజలకు ఆదర్శంగా ఉండాలని, ఇలాంటి ప్రవర్తన వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తుందని వ్యాఖ్యానించారు.

### వివరణ ఇచ్చిన ఐజీపీ రమ్య భారతి

తనపై వచ్చిన విమర్శల నేపథ్యంలో ఐజీపీ ఆర్‌వీ రమ్య భారతి స్పందించారు. ప్రెస్‌మీట్ సమయంలో జరిగిన నవ్వు ఘటనను వివరిస్తూ, అది కేసు విషయానికి సంబంధించిందికాదని తెలిపారు. సమావేశంలో వేరే అంశం చర్చకు వచ్చిన సమయంలో సహచర అధికారులతో జరిగిన సాధారణ సంభాషణ కారణంగా నవ్వు వచ్చిందని ఆమె వివరణ ఇచ్చారు. కేసు విషయాన్ని తేలికగా తీసుకున్నట్టు భావించడం సరైంది కాదని, దర్యాప్తు పూర్తిగా సీరియస్‌గా కొనసాగుతోందని ఆమె స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలను కొంతమంది అపార్థంగా తీసుకుంటున్నారని కూడా పేర్కొన్నారు.

### రాజకీయ కోణంలో చర్చ

ఈ ఘటనపై రాజకీయంగా కూడా చర్చ మొదలైంది. తమిళనాడులోని కొందరు నాయకులు అధికారుల ప్రవర్తనపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇటీవలే ఒక రాష్ట్ర మంత్రి కూడా ఈ కేసు నేపథ్యంలో మీడియా సమావేశంలో నవ్విన వీడియో వైరల్ కావడంతో విమర్శలు ఎదుర్కొన్నారు. దీనిపై ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా స్పందించాయి.

బాధిత కుటుంబానికి న్యాయం జరగాల్సిన సమయంలో ఇలాంటి ప్రవర్తనలు ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని తగ్గిస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ప్రజల ఆగ్రహానికి కారణం ఏమిటి?

ఈ ఘటనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి ప్రధాన కారణం కేసు స్వభావం. బాలికపై జరిగిన హత్యాచారం వంటి దారుణ ఘటనలో సమాజం ఇప్పటికే షాక్‌లో ఉంది. ఇలాంటి సమయంలో అధికారుల ప్రవర్తనలో చిన్న అసంబద్ధత కూడా పెద్ద వివాదంగా మారుతుంది. అంతేకాకుండా పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకం కూడా ఈ ఘటనలతో ప్రభావితమవుతుంది. బాధితులకు న్యాయం అందించడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తారని భావిస్తారు కాబట్టి, వారి ప్రవర్తనపై ప్రజల అంచనాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

### కేసు దర్యాప్తు కొనసాగుతోంది

ఈ ఘటనతో సంబంధం లేకుండా కోయంబత్తూరు బాలిక హత్యాచారం కేసు దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులను పట్టుకోవడం, ఆధారాలు సేకరించడం వంటి ప్రక్రియలు వేగంగా జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. కోయంబత్తూరు బాలిక హత్యాచారం కేసు ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆవేదనను కలిగించగా, పోలీసు అధికారుల నవ్వు వీడియో ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. సోషల్ మీడియా యుగంలో ప్రతి చర్య వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

# తమిళనాడు రైతులకు భారీ ఊరట



- పంట రుణాలపై చరిత్రాత్మక రుణమాఫీ నిర్ణయం
- తీసుకున్న సీఎం విజయ్
- రూ.50 వేల వరకు పూర్తిగా మాఫీ, పైగా రుణాలకు 50 శాతం రాయితీ
- 14.22 లక్షల రైతులకు లబ్ధి, రాష్ట్ర ఖజానాపై రూ.2,044 కోట్ల భారం
- మేకేదాటు ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష

చెన్నై వెలుతురు మే 25

తమిళనాడులో రైతులకు భారీ ఊరట కలిగించే కీలక నిర్ణయాన్ని ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా సహకార బ్యాంకుల ద్వారా తీసుకున్న పంట రుణాలపై సమగ్ర రుణమాఫీ పథకాన్ని ప్రకటిస్తూ ప్రభుత్వం రైతులకు పెద్ద ఆర్థిక ఉపశమనాన్ని కల్పించింది. చిన్న, సన్నకారు రైతుల ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం, సహకార బ్యాంకుల నుంచి రూ.50,000 వరకు పంట రుణాలు తీసుకున్న సన్నకారు రైతులకు పూర్తిగా రుణమాఫీ వర్తించనుంది. అంటే ఈ పరిమితిలో ఉన్న రుణాలు పూర్తిగా రద్దు చేయబడతాయి. రైతులపై ఉన్న తక్షణ రుణ ఒత్తిడిని తగ్గించడమే కాకుండా వ్యవసాయ కార్యకలాపాలకు మళ్లీ ఊపిరి పోసేలా ఈ చర్య ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇక రూ.50,000కు పైగా రుణాలు తీసుకున్న రైతులకు 50 శాతం రుణమాఫీ ప్రకటించారు. మిగిలిన 50 శాతం రుణాన్ని మాత్రమే తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. దీని ద్వారా పెద్ద మొత్తంలో రుణభారం తగ్గి, రైతులు మిగిలిన రుణాన్ని సులభంగా తీర్చే అవకాశం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ రుణమాఫీ పథకం 2025 మే 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 మధ్యకాలంలో సహకార బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలకు మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కాలపరిమితిలో తీసుకున్న అర్హత గల రుణాలకే మాఫీ వర్తించేలా మార్గదర్శకాలు రూపొందించనున్నారు. అర్హత నిర్ధారణ, డేటా వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ అంచనాల ప్రకారం ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14.22 లక్షల మంది రైతులు ప్రత్యక్షంగా లబ్ధి పొందనున్నారు. ముఖ్యంగా సన్నకారు, మధ్యతరగతి రైతులు దీని ద్వారా ఎక్కువగా లాభపడతారని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న రుణ ఒత్తిడిని తగ్గించి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఈ రుణమాఫీ పథకం అమలుతో రాష్ట్ర ఖజానాపై సుమారు రూ.2,044 కోట్ల అదనపు భారం పడనుందని ఆర్థిక శాఖ వర్గాలు అంచనా వేశాయి. అయినప్పటికీ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేసినట్లు సమాచారం. వ్యవసాయ రంగం బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, సహకార శాఖ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రుణమాఫీ అమలు విధానం, అర్హత ప్రమాణాలు, బ్యాంకుల ద్వారా డేటా సమన్వయం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఇదే సమావేశంలో కావేరీ నది జల వివాదానికి సంబంధించిన మేకేదాటు ప్రాజెక్టుపై కూడా ప్రభుత్వం సుదీర్ఘ సమీక్ష నిర్వహించింది. కర్ణాటక ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్తున్న నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వ వైఖరిని మరోసారి స్పష్టంగా చర్చించారు. రాష్ట్ర నీటి హక్కులపై ఎలాంటి ప్రభావం పడుతుందన్న అంశాన్ని అధికారులు సమావేశంలో వివరించారు. మేకేదాటు ప్రాజెక్టు నిర్మాణం వల్ల తమిళనాడుకు రావాల్సిన కావేరీ జలాల వాటా తగ్గే అవకాశం ఉందని, ఇది రైతులపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఈ కారణంగా తమిళనాడు ప్రభుత్వం ప్రారంభం నుంచే ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తోంది. ఇటీవల కర్ణాటకలో ప్రాజెక్టుకు సంబంధించిన భూమిపూజ జరగడంతో ఈ వివాదం మరోసారి వేడెక్కింది. ఈ అంశానికి సంబంధించిన లీగల్ స్టేటస్‌పై కూడా ఉన్నత స్థాయి సమావేశంలో చర్చ జరిగింది. కోర్టు అభిప్రాయాలు, గత తీర్పులను పరిగణనలోకి తీసుకుని తదుపరి వ్యూహాన్ని రూపొందించాలని అధికారులు సూచించారు. లీగల్ చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి విజయ్ ఆదేశించినట్లు సమాచారం. ఈ సమావేశంలో మంత్రి ఎన్. ఆనంద్, ఆధవ్ ఆర్జున, ఆర్. నిర్మల్‌కుమార్‌తో పాటు అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వం రెండు కీలక అంశాలపై—రైతుల రుణ ఉపశమనం మరియు జల వివాదం—పై సమాంతరంగా వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈ నిర్ణయం తమిళనాడులో రైతులకు పెద్ద ఆర్థిక ఊరటనిచ్చే చర్యగా భావిస్తున్నారు. మరోవైపు కావేరీ జల వివాదంపై ప్రభుత్వం మరింత దూకుడుగా న్యాయపరమైన చర్యలకు సిద్ధమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి

# రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నాం

- కేంద్రం మద్దతు ధరలు ప్రకటిస్తోందే తప్ప కొనుగోళ్లు చేయడం లేదన్న సీఎం రేవంత్‌రెడ్డి
- సీపీఎం ప్రతినిధి బృందంతో సీఎం సమావేశం
- కార్మికుల కనీస వేతనాల పెంపుపై ప్రభుత్వానికి సీపీఎం ధన్యవాదాలు
- ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష చేస్తున్నానన్న సీఎం
- సన్నవడ్లకు రూ.500 బోనస్‌తో కొనుగోళ్లు చేస్తున్నట్లు వెల్లడి
- హమాలీల కొరత, ఎండల కారణంగా కొనుగోళ్లలో స్వల్ప ఇబ్బందులున్నాయని వివరణ
- మూసీ నిర్వాసితులకు స్థానికంగానే ఇళ్లు మంజూరు చేస్తామని హామీ
- మూసీ పునరుజ్జీవంతో పర్యాటకం, ఉపాధికి ఊతమంటూ వ్యాఖ్య
- ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని స్పష్టం
- తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు దిశగా చర్యలు
- నాణ్యమైన విద్య, పోషకాహారం అందించడమే లక్ష్యమని సీఎం వ్యాఖ్య



హైదరాబాద్ వెలుతురు మే 25

రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కేవలం మద్దతు ధరలు ప్రకటించడం తప్ప రాష్ట్రంలో పంట కొనుగోళ్లలో చురుకుగా వ్యవహరించడం లేదని విమర్శించారు. కనీసం 30 శాతం ధాన్యాన్ని కూడా కేంద్రం సేకరించడం లేదని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయం తీసుకున్నందుకు సీపీఎం నాయకులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీసుకొస్తున్న ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అయితే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా అక్కడి నుంచి వచ్చే హమాలీలు స్వరాష్ట్రానికి వెళ్లిపోవడంతో కొంతమేర కార్మికుల కొరత ఏర్పడిందని తెలిపారు. అదేవిధంగా తీవ్రమైన ఎండల కారణంగా మధ్యాహ్న సమయంలో పనులు మందగిస్తున్నాయని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై తాను నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నానని సీఎం వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సన్నవడ్లకు క్వింటాల్‌కు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను కూడా మద్దతు ధరకు సేకరిస్తున్నామని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై కూడా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగానే వారికి నివాసాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ అంశంపై రాజకీయ పార్టీలు అనవసర రాజకీయాలు చేయడం సరి కాదన్నారు. మూసీ నదిని పునరుద్ధరించి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మూసీ కాలుష్యం కారణంగా ముఖ్యంగా నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య ప్రభావంతో అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు అమలు వల్ల యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు నగర ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అందులో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలను మరింత పెంచేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నాయకులను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ప్రభుత్వ విద్యలో తీసుకొస్తున్న మార్పులను ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు జూలకంటి రంగారెడ్డి, పీ సుదర్శన్, జ్యోతి, నున్నా నాగేశ్వరరావు, మల్లు లక్ష్మి, సామినేని స్వరాజ్యం, ఎం గోపాలరావు పాల్గొన్నారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి కూడా హాజరయ్యారు.

# లిక్కర్ స్కామ్ ప్రచారంపై ఎంపీ చిన్ని ఆగ్రహం

- నోటీసులు కంపెనీకే తప్ప నా భార్యకు కాదు
- ఆధారాలతో సహా పూర్తి వివరాలు వెల్లడి
- భార్యపై వస్తున్న ఈడీ నోటీసుల వార్తలు పూర్తిగా అవాస్తవం
- రెండు దిగ్గజ రియల్ ఎస్టేట్ సంస్థల కలయిక – 'ఫ్రైడ్ ఇన్‌ఫ్రా' ఆవిర్భావం
- 2021లో ఉమ్మడి ప్రాజెక్ట్ ప్రారంభానికి గల కారణాల విశ్లేషణ
- వివాదాస్పద రాజ్ కసి రెడ్డి నేపథ్యంతో పెరిగిన దూరం
- 2022లోనే సంస్థ నుండి వైదొలిగిన కేశినేని డెవలపర్స్
- కేవలం రూ. 35 లక్షల ఆర్కిటెక్చరల్ లావాదేవీలపైనే ఈడీ ఆరా
- ఈ నెల 27వ తేదీన కేంద్ర దర్యాప్తు సంస్థకు పూర్తి స్థాయి వివరణ
- రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు ప్రచారాలు – కేశినేని శివనాథ్ వెల్లడి



విజయవాడ వెలుతురు మే 25

విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తన కుటుంబంపై, ముఖ్యంగా తన భార్యపై వస్తున్న రాజకీయ ఆరోపణలను, మద్యం కుంభకోణానికి సంబంధించిన తప్పుడు వార్తలను తీవ్రంగా ఖండించారు. లిక్కర్ స్కామ్ వ్యవహారంలో తన భార్యకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసిందంటూ సోషల్ మీడియా మరియు కొన్ని ప్రధాన వార్తా సంస్థలలో జరుగుతున్న ప్రచారం ముమ్మాటికీ అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. ఈ రకమైన అసత్య ప్రచారాలు ప్రజాప్రతినిధుల ప్రతిష్టను దెబ్బతీయడానికేనని ఆయన మండిపడ్డారు. దర్యాప్తు సంస్థ నుంచి నోటీసు అందింది నిజమే అయినప్పటికీ.. అది ఒక వ్యాపార సంస్థకు (కంపెనీకి) జారీ అయిన నోటీసు మాత్రమేనని, అందులో తన భార్యకు వ్యక్తిగతంగా ఎటువంటి సంబంధం లేదని కేశినేని శివనాథ్ నిస్సందేహంగా తేల్చి చెప్పారు. ఈ వివాదానికి దారితీసిన వ్యాపార లావాదేవీల వెనుక ఉన్న అసలు నేపథ్యాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాకు కూలంకషంగా వివరించారు. గతంలో 'ఇషాన్వి' గ్రూప్స్ మరియు తమకు చెందిన 'కేశినేని డెవలపర్స్' సంయుక్తంగా కలిసి ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించాయని తెలిపారు. అందుకోసం 2021వ సంవత్సరంలో ఉమ్మడిగా 'ఫ్రైడ్ ఇన్‌ఫ్రా' అనే సరికొత్త రియల్ ఎస్టేట్ సంస్థను అధికారికంగా ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. తమకు సంబంధించిన భూములు ఒకదానికొకటి ఆనుకుని ఉండటం వల్ల, సమగ్రమైన అభివృద్ధి కోసం రాజ్ కసి రెడ్డికి చెందిన ఇషాన్వి సంస్థతో భాగస్వామ్యం కావలసి వచ్చిందని, అంతకుమించి ఇందులో ఎటువంటి ఇతర మతకలహాలు లేదా ఆర్థిక అవకతవకలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఆ సంస్థ అంతర్గత వ్యవహారాల గురించి మరింత సమాచారం ఇస్తూ.. ఈ ఉమ్మడి వ్యాపార సంస్థలో తన భార్య కేవలం ఒక డైరెక్టర్‌గా మాత్రమే బాధ్యతలు నిర్వహించారని, ఆమెకు ఎటువంటి వ్యక్తిగత ఆర్థిక లబ్ధి చేకూరలేదని ఎంపీ స్పష్టం చేశారు. కేవలం ఒక ప్రాజెక్ట్ రూపకల్పన కోసం మాత్రమే ఈ సంస్థ పని చేసిందని తెలిపారు. ఈ సంస్థ ద్వారా కేవలం రూ. 35 లక్షల విలువైన అతి తక్కువ లావాదేవీలు మాత్రమే జరిగాయని, అవి కూడా ప్రాజెక్ట్ రూపకల్పనకు సంబంధించిన ఆర్కిటెక్చరల్ ఫీజుల నిమిత్తం చెల్లించిన అధికారిక మొత్తమని వివరించారు. ఆ సంస్థ ద్వారా మరే ఇతర పెద్ద ఎత్తున ఆర్థిక కార్యకలాపాలు గానీ, ఇతర వ్యాపారాలు గానీ జరగలేదని తాము ఈడీకి ఇచ్చే సమాధానంలో పక్కా ఆధారాలతో నిరూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అయితే, భాగస్వామ్య పక్షమైన రాజ్ కసి రెడ్డి యొక్క వివాదాస్పద నేపథ్యం మరియు ఇతర ఆర్థిక వ్యవహారాల గురించి తమకు సమాచారం తెలియగానే తాము తక్షణమే అప్రమత్తమయ్యామని కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. 2021లో సంస్థను స్థాపించినప్పటికీ, కేవలం ఒకే ఒక్క సంవత్సరంలోనే అంటే 2022లోనే తాము ఆ 'ఫ్రైడ్ ఇన్‌ఫ్రా' సంస్థ నుండి పూర్తిగా వైదొలిగామని స్పష్టం చేశారు. తాము కంపెనీ నుండి తప్పుకున్న తర్వాత జరిగిన ఎలాంటి పరిణామాలకు తమకు సంబంధం ఉండదని స్పష్టం చేశారు. కేవలం తాము భాగస్వాములుగా ఉన్న సమయంలో జరిగిన ఆ రూ. 35 లక్షల పాత లావాదేవీపైనే ప్రస్తుతం ఈడీ వివరణ కోరిందని, ఇందుకు సంబంధించిన పూర్తి స్థాయి చట్టపరమైన సమాధానాన్ని ఈ నెల 27వ తేదీన దర్యాప్తు అధికారుల ముందు ఉంచుతామని విజయవాడ ఎంపీ ప్రకటించారు.

# ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోవాలా?




- జగన్ జైలుకు వెళితే నాకు వచ్చే లాభం ఏమిటి?
- విశ్లేషకుల పేరుతో తప్పుడు ప్రచారం చేస్తారా?
- వ్యక్తిగత దాడులు చేస్తే మేం కూడా తిప్పికొడతం
- రాజకీయాల్లో అన్నీ కోల్పోయేందుకు సిద్ధంగా వచ్చా: పవన్ కల్యాణ్
- సోషల్ మీడియా, వెబ్‌సైట్లపై హెచ్చరిక
- ఎదురుదాడికి సిద్ధమని స్పష్టీకరణ
- కూటమి బలానికి క్రమశిక్షణే కీలకం

అమరావతి వెలుతురు మే 25

రాజకీయాల్లో తాను అన్నీ పోగొట్టుకునేందుకు సిద్ధంగా వచ్చానని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరంలో జనసేన నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే తాము కూడా తగిన విధంగా ఎదురుదాడి చేస్తామని హెచ్చరించారు. తనపై జరుగుతున్న విమర్శలను ఉద్దేశించి స్పందించిన పవన్ కల్యాణ్, “ఎక్కడ ఎలాంటి గొడవలు పెట్టుకుంటారో చెప్పండి, నేను సిద్ధం. ఛాయిస్ మీకే ఇస్తున్నా. నన్ను రెచ్చగొట్టొద్దు” అని వ్యాఖ్యానించారు. తనను విమర్శించే వారు ధైర్యంగా ముందుకు రావాలా లేదా అని ప్రశ్నించారు. సోషల్ మీడియా వేదికలపై కొంతమంది కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని విశ్లేషణలపై కూడా పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ముఖ్యంగా ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, “జగన్‌ను జైలుకు పంపాలని నేను కోరినట్లు చెప్పడం లాజిక్ లేని మాట. జగన్ జైలుకు వెళ్తే నాకు లాభం ఏముంటుంది?” అని ప్రశ్నించారు. రాజకీయ ప్రత్యర్థి బలంగా ఉన్నప్పుడు మాత్రమే తాను రాజకీయంగా పోరాడతానని, బలహీనంగా ఉన్నప్పుడు దాడి చేయనని స్పష్టం చేశారు. తనను విమర్శించేవారు కుల రాజకీయాల అంశాన్ని ముందుకు తెస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తూ, తర్వాత కుల కార్డును తీసుకురావడం సరికాదని అన్నారు. మౌనంగా ఉన్నానంటే బలహీనత కాదని, సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా, కొన్ని వెబ్‌సైట్లు తమ ప్రభావం ఎక్కువగా ఉందని భావిస్తున్నాయని, కానీ అలా అనుకోవడం పొరపాటని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అవసరమైతే తాము కూడా దీటుగా స్పందిస్తామని, వ్యక్తిగతంగా దూషిస్తే తాము కూడా అదే విధంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. పార్టీ నిర్వహణపై మాట్లాడుతూ, రాజకీయాల్లో క్రమశిక్షణ అత్యంత అవసరమని తెలిపారు. క్రమశిక్షణ లేకుండా పార్టీ బలపడదని, కూటమిలో కూడా స్థిరత్వం రాదని అన్నారు. పదవులు వచ్చిన తరువాత కొంతమంది నేతలు చురుకుదనం కోల్పోయారని ఆయన వ్యాఖ్యానించారు. జనసేనలో పదవుల కోసం మాత్రమే చేరినవారు ఉండకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పార్టీ మూల స్వభావం పోరాటమేనని, ఆత్మబలం, క్రమశిక్షణతోనే ముందుకు సాగాలని సూచించారు. అర్ధరాత్రి సమయంలో కూడా పార్టీ జెండా పట్టుకుని ప్రజల మధ్య నిలబడే కార్యకర్తలే జనసేన బలం అని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రయోజనాల కోసం కొన్నిసార్లు సర్దుకోవాల్సి వస్తుందని, అది వ్యక్తిగత పార్టీ కోసం కాదని, మొత్తం ప్రజల ప్రయోజనాల కోసం అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఐదు కోట్ల ప్రజల కోసం కొన్నిసార్లు సహనం అవసరమని, అది బలహీనత కాదని ఆయన స్పష్టం చేశారు.

# పరిశ్రమల రంగానికి సరికొత్త జవసత్వాలు




- మరావతి వెలుతురు మే 25

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అద్భుతమైన ప్రగతి పథంలో నడిపించేందుకు సరికొత్త పారిశ్రామిక విధానాలు, ఎంఎస్ఎంఈ సంస్కరణలను తీసుకువచ్చినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విజయవాడ వేదికగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక 'ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026' లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఒక చిన్న ఆలోచనను కూడా ప్రపంచస్థాయి పరిశ్రమగా మార్చగలిగే అద్భుతమైన సత్తా కేవలం ఎంఎస్ఎంఈ రంగానికి మాత్రమే సాధ్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, నిరుద్యోగ నిర్మూలనకు తోడ్పడుతున్న రెండో అతిపెద్ద రంగం ఇదేనని ఆయన కొనియాడారు. రాష్ట్రంలో ఉన్న మానవ వనరులు, సహజ వనరులను గరిష్టంగా వినియోగించుకునేలా పారిశ్రామికవేత్తలకు అనువైన వాతావరణాన్ని తమ ప్రభుత్వం కల్పిస్తోందని భరోసా ఇచ్చారు. ఈ గ్రోత్ సమ్మిట్ ద్వారా సరికొత్త ఆవిష్కరణలు చేసే స్టార్టప్‌లు, చిన్న తరహా పారిశ్రామిక యూనిట్లు, అంతర్జాతీయ స్థాయి నిపుణులు మరియు ఆర్థిక సహాయం అందించే బ్యాంకులు అంతా ఒకే వేదికపైకి రావడం శుభపరిణామమని సీఎం చంద్రబాబు నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను రూపాంతరం చెందించేందుకు 'వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్' (ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త) అనే వినూత్న విధానాన్ని బలంగా ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన శక్తులన్నింటినీ వ్యాపారవేత్తలుగా మార్చి, పెద్ద ఎత్తున సొంత పారిశ్రామిక యూనిట్లను నెలకొల్పేలా ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని రకాల రాయితీలు, సలహాలు, సాంకేతిక సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒక ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కును యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని సీఎం వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇవాళ ఒకేసారి 38 పారిశ్రామిక పార్కులకు శంకుస్థాపన చేశామని, గతంలో చేసిన వాటితో కలిపి వందకు పైగా పార్కులకు శంకుస్థాపనల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఎటువంటి వివాదాలు, న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా ఈ పారిశ్రామిక ప్రాంతాల ఏర్పాటు కొరకు ముందుకు వచ్చి, ప్రభుత్వానికి స్వచ్ఛందంగా భూములు అప్పగించిన రైతులకు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల పాలసీలను కూడా పటిష్టంగా అమలు చేస్తున్నామని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటయ్యే ప్రైవేట్ పార్కులకు కూడా ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్ (ప్రోత్సాహకాలు) అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ మహిళా సాధికారతపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని డ్వాక్రా మహిళా సంఘాల వద్ద దాదాపు రూ. 28 వేల కోట్ల భారీ కార్పస్ ఫండ్ (నిధి) అందుబాటులో ఉందని ఆయన వెల్లడించారు. ఈ అపారమైన ఆర్థిక శక్తిని వ్యాపార నైపుణ్యాలుగా మార్చేందుకు గాను, ప్రస్తుత ఏడాదిలోనే ఏకంగా 5 లక్షల మంది డ్వాక్రా మహిళలను విజయవంతమైన స్వయం ఉపాధి పారిశ్రామికవేత్తలుగా (ఎంటర్‌ప్రెన్యూర్లుగా) తీర్చిదిద్దుతామని సంచలన ప్రకటన చేశారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో ఇప్పటికే రూ. 500 కోట్ల మేర పెండింగ్ పారిశ్రామిక ప్రోత్సాహక నిధులను విడుదల చేశామని, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కొరకు మరో రూ. 200 కోట్లతో 'క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' ను కూడా ప్రారంభిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. రాష్ట్రం నుండి రాబోయే రోజుల్లో అద్భుతమైన సాంకేతిక సంస్థలను ప్రపంచానికి పరిచయం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోతున్న 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' ద్వారా వినూత్న ఆలోచనలతో వచ్చే యువతను, స్టార్టప్‌లను అన్ని విధాలా ప్రోత్సహిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ భూభాగం నుండి కనీసం వంద యునికార్న్ (బిలియన్ డాలర్ల విలువైన) సంస్థలను సృష్టించడమే తమ ప్రభుత్వ అంతిమ గమ్యమని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తు కాలం అంతా 'నాలెడ్జ్ ఎకానమీ' (జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ) దేనని, ఈ సరికొత్త విప్లవాన్ని రాష్ట్ర యువత, పారిశ్రామికవేత్తలు తక్షణమే అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. 'విలేజ్ టు గ్లోబల్ మార్కెట్' (గ్రామం నుండి ప్రపంచ మార్కెట్ వరకు) అనే నినాదంతో గ్రామీణ ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తామన్నారు. ఒక పరిశ్రమ విడిచిపెట్టే వ్యర్థాలు, మరో పరిశ్రమకు నాణ్యమైన ముడి సరుకుగా మారేలా పర్యావరణ హితమైన 'సర్క్యులర్ ఎకానమీ' వ్యవస్థ మరియు సమర్థవంతమైన ఎంఎస్ఎంఈ ఎకో సిస్టమ్ రాష్ట్రంలో తయారు కావాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సమ్మిట్ ప్రారంభోత్సవానికి ముందు, విజయవాడలో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎంఎస్ఎంఈ సాంకేతిక ప్రదర్శన స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆసక్తిగా సందర్శించారు. ఆర్టీహెచ్ లోని వివిధ నూతన స్టార్టప్ కంపెనీలు తయారు చేసిన వినూత్న 'టెక్నాలజీ ఎనేబుల్డ్ హ్యాండ్' పని తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే వీరపనేనిగూడెంలో స్థానికంగా తయారవుతున్న రక్షణ రంగ (డిఫెన్స్) ఉత్పత్తులను, మచిలీపట్నంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్ఈఎల్ రూపొందించిన అత్యాధునిక ఎలక్ట్రికల్ పరికరాలను, ఉత్పత్తులను సీఎం నిశితంగా పరిశీలించి నిపుణులను అభినందించారు. వీటితో పాటు విపత్తుల సమయంలో ఉపయోగపడే డ్రోన్ బోట్లు, గిరిజన ప్రాంతాల ప్రజలు అడవుల్లో సహజసిద్ధంగా సాగు చేస్తున్న కొండ చీపురు గడ్డి ద్వారా తయారు చేసిన వివిధ రకాల హస్తకళల ఉత్పత్తులను ఆయన ఆత్మీయంగా పరిశీలించి, వాటి మార్కెటింగ్ అవకాశాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

# చికెన్ కిచెన్





**మాంసం, చేపలు, రొయ్యలతో పోలిస్తే ఎక్కువమందికి ఇష్టమైంది చికెన్. దీంతో కూర, వేపుడు, పులుసు.. దేనికదే వహ్వా అనిపిస్తుంది. అదలా ఉంచితే.. చికెన్ కర్రీ చేయడంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. మీ కోసం కొన్ని వెరైటీలు..**

## చికెన్ చంగేజీ

**కావలసినవి:**
చికెన్ ముప్పావు కిలో,
పెరుగు అర కప్పు,
అల్లం వెల్లుల్లి పేస్ట్ 2 టేబుల్ స్పూన్లు,
కశ్మీరీ కారం 2 స్పూన్లు,
ఉప్పు రుచికి తగినంత,
నిమ్మరసం 2 స్పూన్లు,
గరం మసాలా అర స్పూన్,
పసుపు పావు స్పూన్

**గ్రేవీ కోసం:**
ఉల్లిపాయలు 4,
టొమాటోలు 5,
జీడిపప్పులు 15,
పాలు ముప్పావు కప్పు,
అల్లం వెల్లుల్లి పేస్ట్,
కసూరీ మేథీ టేబుల్ స్పూన్ చొప్పున,
కశ్మీరీ కారం ఒకటిన్నర స్పూన్లు,
జీలకర్ర పొడి,
గరం మసాలా స్పూన్ చొప్పున,
ధనియాల పొడి 2 స్పూన్లు,
ఛాట్ మసాలా అర స్పూన్,
నూనె,
ఫ్రెష్ క్రీమ్ 4 టేబుల్ స్పూన్ల చొప్పున,
వెన్న 2 టేబుల్ స్పూన్లు,
పచ్చిమిర్చి 2,
కొత్తిమీర గుప్పెడు,
నీరు ఒకటిన్నర కప్పులు

**తయారీ:**
చికెన్‌లో పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, ఉప్పు, నిమ్మరసం, గరం మసాలా, పసుపు వేసి బాగా కలిపి.. అరగంట నాననివ్వాలి. ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి ఉల్లితరుగును వేయించాలి. అది లేత బంగారు రంగులోకి మారాక.. జీడిపప్పు వేయాలి. అది కూడా వేగాక.. సెగ తీసేయాలి. చల్లారాక పాలు జోడించి గ్రైండ్‌చేసి పక్కనుంచాలి. కడాయిలో మిగిలిన నూనెను వేడిచేసి.. అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను వేయించాలి. కాస్త వేగాక.. టొమాటో ప్యూరీ జతచేసి ఉడికించాలి. ఇప్పుడు ధనియాలు, జీలకర్ర పొడులు, కారం, గరం మసాలా, ఉల్లిజీడిపప్పు పేస్ట్, పచ్చిమిర్చి, మ్యారినేట్ చేసిన చికెన్ జోడించి.. హై ఫ్లేమ్ మీద ఐదు నిమిషాలు వేయించాలి. అందులో ఒక టిన్నర కప్పుల నీళ్లు పోసి మూత పెట్టాలి. సెగ తగ్గించి.. చికెన్ మెత్తగా అయ్యే వరకూ ఉడికించాలి. చివర్లో క్రీమ్, ఛాట్ మసాలా, కసూరీ మేథీ, కొత్తిమీర తరుగు వేసి.. ఒక నిమిషం ఉంచి స్టౌ ఆఫ్ చేయాలి. అంతే.. పంజాబీ స్టైల్ చికెన్ చంగేజీ తయారైపోతుంది. ఇది అన్నం, నాన్, చపాతీ, రుమాలీ రోటీ ఎందులోకైనా బాగుంటుంది.

## చికెన్ నిహారీ

**కావలసినవి:**
చికెన్ కిలో,
ఉల్లిపాయలు 5,
పెరుగు అర కప్పు,
అల్లం వెల్లుల్లి పేస్ట్ 3 టేబుల్ స్పూన్లు,
పచ్చిమిర్చి 4,
టొమాటోలు 3,
నూనె అర కప్పు,
ఉప్పు రుచికి తగినంత,
ధనియాలు 2 టేబుల్ స్పూన్లు,
జీలకర్ర టేబుల్ స్పూన్,
సోంపు,
మిరియాలు స్పూన్ చొప్పున,
లవంగాలు 6,
యాలకులు 5,
బిర్యానీ ఆకులు 2,
దాల్చిన చెక్క అంగుళం ముక్క,
జాజికాయ పొడి చిటికెడు,
జాపత్రి కొద్దిగా,
కశ్మీరీ కారం 2 స్పూన్లు,
పసుపు అర స్పూన్,
గోధుమపిండి 2 టేబుల్ స్పూన్లు,
అల్లం తరుగు స్పూన్,
నిమ్మచెక్కలు 4,
పచ్చిమిర్చి 2,
కొత్తిమీర తరుగు గుప్పెడు

**తయారీ:**
ప్యాన్‌లో దాల్చిన చెక్క, యాలకులు, బిర్యానీ ఆకులు, మిరియాలు, జీలకర్ర, ధనియాలు, సోంపు, లవంగాలను మంచి వాసన వచ్చే వరకూ వేయించాలి. చల్లారాక.. పొడి చేసి.. జాజికాయ పొడి, జాపత్రి, కారం, పసుపు వేసి కలపాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో నూనె వేడిచేసి ఉల్లితరుగును లేత గోధుమ రంగు వచ్చే వరకూ వేయించాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్, చికెన్ వేసి బాగా ఫ్రై చేయాలి. అందులో పెరుగు వేసి కలియబెడుతూ ఉడికించాలి. ఇప్పుడు నిహారీ మసాలా, ఉప్పు, టొమాటో, పచ్చిమిర్చి ముక్కలు, తగినన్ని నీళ్లు జతచేసి కలిపి.. మూతపెట్టి సన్న సెగ మీద 40 నిమిషాలు ఉడికించాలి. అర కప్పు నీళ్లలో గోధుమపిండి వేసి ఉండలు కట్టకుండా కలిపి కర్రీలో కొద్దికొద్దిగా పోస్తూ కలియబెట్టాలి. మరో పది నిమిషాలు ఉడికిస్తే నీరు తగ్గి, చిక్కగా అవుతుంది. చివరగా పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర తరుగు వేసి దించేసి.. నిమ్మచెక్కలతో అలంకరిస్తే.. దిల్లీ స్టైల్ చికెన్ నిహారీ రెడీ. వేడిగా సర్వ్ చేస్తే అదిరిపోతుంది.



## చికెన్ యఖనీ

**కావలసినవి:**
చికెన్ కిలో,
పెరుగు రెండు కప్పులు,
శనగపిండి ఒకటిన్నర స్పూన్లు,
ఉల్లితరుగు అర కప్పు,
డ్రై జింజర్ పౌడర్,
షాజీరా,
జీలకర్ర పొడి స్పూన్ చొప్పున,
సోంపు పొడి 2 స్పూన్లు,
మిరియాల పొడి అర స్పూన్,
యాలకులు 4,
లవంగాలు 5,
దాల్చిన చెక్క అంగుళం ముక్క,
బిర్యానీ ఆకులు రెండు,
నెయ్యి రెండు టేబుల్ స్పూన్లు,
నూనె 4 టేబుల్ స్పూన్లు,
ఉప్పు రుచికి తగినంత,
పచ్చిమిర్చి మూడు,
కొత్తిమీర పావు కప్పు,
పుదీనా రెండు టేబుల్ స్పూన్లు,
నీళ్లు 3 కప్పులు



**తయారీ:**
చికెన్‌ను శుభ్రంగా కడిగి నీళ్లు వంపేయాలి. పెరుగు బాగా గిలకొట్టి, శనగపిండి కలిపి పక్కనుంచాలి. ఇలా చేయడం వల్ల పెరుగు విరిగినట్లవ్వదు. వెడల్పాటి పాత్రలో నూనె వేడయ్యాక.. దాల్చిన చెక్క, బిర్యానీ ఆకులు, యాలకులు, లవంగాలు, షాజీరా వేసి మంచి వాసన వచ్చే వరకూ వేయించాలి. అందులో ఉల్లి తరుగు జతచేసి లేత గోధుమ రంగు వచ్చే వరకూ వేగనివ్వాలి. ఇప్పుడు చికెన్ జోడించి.. మధ్యస్థమైన సెగ మీద ఏడెనిమిది నిమిషాలు బాగా వేయించాలి. డ్రై జింజర్ పౌడర్, సోంపు, జీలకర్ర, మిరియాల పొడులు, ఉప్పు జోడించి కలపాలి. సెగ తగ్గించి.. గిలకొట్టిన పెరుగు కొద్దికొద్దిగా వేస్తూ కలియబెట్టాలి. పది నిమిషాలు సన్న సెగ మీద ఉడికించి.. పచ్చిమిర్చి, మూడు కప్పుల నీళ్లు జోడించి.. మూతపెట్టాలి. అరగంట తర్వాత గ్రేవీ కొంచెం దగ్గరపడుతుంది.. అదే అసలైన కశ్మీరీ స్టైల్ యఖనీ. చివర్లో పుదీనా, కొత్తిమీర, నెయ్యి జోడించి రెండు నిమిషాలుంచి సెగ తీసేయాలి. ఇది జీరా రైస్, పులావ్‌లోకి మరింత బాగుంటుంది.

## అవధీ చికెన్ కర్రీ

**కావలసినవి:**
చికెన్ కిలో,
ఉల్లిపాయలు 5,
పెరుగు ముప్పావు కప్పు,
అల్లం వెల్లుల్లి పేస్ట్ 2 స్పూన్లు,
పచ్చిమిర్చి 4,
జీడిపప్పులు 12,
గసగసాలు టేబుల్ స్పూన్,
కొబ్బరి తురుము 2 టేబుల్ స్పూన్లు,
పాలు అర కప్పు,
నెయ్యి 3 టేబుల్ స్పూన్లు,
నూనె 4 టేబుల్ స్పూన్లు,
ఉప్పు రుచికి తగినంత,
నీళ్లు 3 కప్పులు,
రోజ్ వాటర్ ఒకటిన్నర స్పూన్లు,
కొత్తిమీర గుప్పెడు,
పుదీనా 2 టేబుల్ స్పూన్లు,
ధనియాలు 2 స్పూన్లు,
జీలకర్ర,
సోంపు,
మిరియాలు స్పూన్ చొప్పున,
దాల్చిన చెక్క అంగుళం ముక్క,
బిర్యానీ ఆకులు 2,
ఆకుపచ్చ యాలకులు 5,
నల్ల యాలకులు 2,
లవంగాలు 6,
జాపత్రి కొద్దిగా,
జాజికాయ పొడి చిటికెడు,
కశ్మీరీ కారం ఒకటిన్నర స్పూన్లు,
పసుపు పావు స్పూన్

**తయారీ:**
ఉల్లిపాయలను సన్నగా తరగాలి. గసగసాలు, జీడిపప్పులను పావుగంట వేడినీళ్లలో నానబెట్టాలి. ఆ నీళ్లు తీసేసి.. పాలు, కొబ్బరి తురుము చేర్చి.. మెత్తని పేస్ట్ చేసుకోవాలి. ప్యాన్‌లో దాల్చిన చెక్క, రెండు రకాల యాలకులు, బిర్యానీ ఆకులు, మిరియాలు, లవంగాలు, జీలకర్ర, సోంపు, ధనియాలను వేయించి చల్లారాక పొడి చేసుకోవాలి. అడుగుభాగం మందంగా ఉన్న గిన్నెలో నూనె వేడిచేసి.. ఉల్లి తరుగును వేయించాలి. అది లేత గోధుమ రంగులోకి మారాక.. అల్లం వెల్లుల్లి పేస్ట్, చికెన్ వేసి హై ఫ్లేమ్ మీద ఫ్రై చేయాలి. అందులో నూరిన మసాలా పొడి, కారం, పసుపు, ఉప్పు, పచ్చిమిర్చి వేసి కలిపి.. సెగ తగ్గించాలి. అందులో పెరుగు, గసగసాలుజీడిపప్పు పేస్ట్ వేసి ఉడికించాలి. 5 నిమిషాల తర్వాత 3 కప్పుల నీళ్లు, పోసి మూతపెట్టాలి. 35 నుంచి 40 నిమిషాల తర్వాత.. మూత తీసి రోజ్ వాటర్, కొత్తిమీర, పుదీనా, నెయ్యి వేసి ఇంకో నిమిషం ఉంచి.. సెగ తీసేయాలి. ఇక ఉత్తర్ ప్రదేశ్ స్టైల్ అవధీ చికెన్ కర్రీ ఘుమఘుమలాడుతుంది.



## లాల్ మిర్చి చికెన్

**కావలసినవి:**
చికెన్ కిలో,
ఉల్లిపాయలు 4,
పెరుగు కప్పు,
అల్లం వెల్లుల్లి పేస్ట్ 3 టేబుల్ స్పూన్లు,
కశ్మీరీ మిర్చి 15,
ధనియాల పొడి,
కారం 2 స్పూన్ల చొప్పున,
జీలకర్ర పొడి,
గరం మసాలా స్పూన్ చొప్పున,
పసుపు పావు స్పూన్,
మిరియాల పొడి అర స్పూన్,
లవంగాలు ఐదు,
యాలకులు నాలుగు,
దాల్చిన చెక్క అంగుళం ముక్క,
బిర్యానీ ఆకులు రెండు,
నెయ్యి మూడు టేబుల్ స్పూన్లు,
నూనె నాలుగు టేబుల్ స్పూన్లు,
ఉప్పు రుచికి తగినంత,
వేడినీళ్లు 3 కప్పులు,
కొత్తిమీర గుప్పెడు

**తయారీ:**
ఎండుమిర్చిని వేడినీళ్లలో 20 నిమిషాలు నానబెట్టి.. మెత్తగా పేస్ట్ చేయాలి. ఉల్లిపాయలను సన్నగా తరగాలి. వెడల్పాటి పాత్రలో నూనె వేడిచేసి.. దాల్చిన చెక్క, బిర్యానీ ఆకులు, యాలకులు, లవంగాలు వేయాలి. మంచి వాసన వస్తుండగా.. ఉల్లితరుగు వేసి లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, చికెన్ వేసి హై ఫ్లేమ్ మీద కలియతిప్పుతుండాలి. ఇప్పుడు ఎండుమిర్చి పేస్ట్, కారం, ధనియాలు, జీలకర్ర పొడులు, పసుపు, ఉప్పు వేసి కలియబెట్టి తక్కువ సెగలో ఉడికించాలి. ఐదు నిమిషాల తర్వాత గిలకొట్టిన పెరుగు చేర్చి.. మూత పెట్టి ఇంకో పది నిమిషాలుంచాలి. ఇప్పుడు మూడు కప్పుల వేడి నీళ్లు పోసి మధ్యస్థమైన సెగ మీద సుమారుగా నలభై నిమిషాలు ఉడికిస్తే.. చికెన్ చక్కగా ఉడుకుతుంది. గ్రేవీ చిక్కబడి, నూనె పైకి తేలుతున్నప్పుడు.. గరం మసాలా, మిరియాల పొడి చల్లి సెగ తగ్గించాలి. ఇంకో నాలుగు నిమిషాల తర్వాత.. కొత్తిమీర, నెయ్యి చేర్చి.. స్టౌ ఆఫ్ చేయాలి. ఇక రాజస్థానీ స్టైల్ లాల్ మిర్చి చికెన్ రెసిపీ తిని ఆనందించడమే తరువాయి.



# ఎబోలాపై భారత్ అప్రమత్తం దేశంలో ఒక్క కేసు లేదు: కేంద్రం స్పష్టీకరణ

- **ఎయిర్‌పోర్టులు, పోర్టుల్లో స్క్రీనింగ్‌కు ఆదేశాలు**
- **ఐసీఎంఆర్, ఎన్‌సీడీసీకి కేంద్రం కీలక సూచనలు**
- **ఆఫ్రికా పరిస్థితులపై కేంద్ర ఆరోగ్యశాఖ నిఘా**
- **జేపీ నడ్డా అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష**
- **వైరస్ వ్యాప్తి నిరోధానికి ప్రత్యేక చర్యలు**
- **సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తత పెంపు**
- **ఆరోగ్య శాఖల సమన్వయంపై కేంద్రం దృష్టి**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు**

ఢిల్లీ వెలుతురు మే 25

ఆఫ్రికా దేశాల్లో ప్రాణాంతక ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్త చర్యలు ప్రారంభించింది. దేశంలో ఇప్పటి వరకు ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. అయినప్పటికీ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా దేశవ్యాప్తంగా నిఘా పెంచినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి Jagat Prakash Nadda సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశంలో ఎబోలా వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై సీనియర్ అధికారులతో సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారా వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. దేశంలోని అన్ని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులు, సముద్ర తీర ప్రాంత పోర్టులు, భూ సరిహద్దు చెక్‌పోస్టుల్లో ప్రత్యేక స్క్రీనింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి ఆదేశించారు. విదేశాల




నుంచి వచ్చే ప్రయాణికుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ అనుమానితులను వెంటనే గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎబోలా వైరస్ గుర్తింపు, పరీక్షలు, వైరస్ వ్యాప్తి పర్యవేక్షణ అంశాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ICMR), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (NCDC) సంస్థలకు కేంద్ర మంత్రి కీలక సూచనలు చేశారు. వైరస్‌ను వేగంగా గుర్తించేందుకు అవసరమైన ల్యాబ్ సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అనుమానిత కేసులు వెలుగులోకి వస్తే వెంటనే ఐసోలేషన్, చికిత్స చర్యలు ప్రారంభించేలా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం పెంచాలని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి వివిధ శాఖలు, కేంద్ర ఏజెన్సీల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విమానయాన, నౌకాశ్రయ, సరిహద్దు భద్రత, ఆరోగ్య విభాగాల మధ్య సమన్వయంపై చర్చించారు. వైరస్ దేశంలోకి ప్రవేశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలపై సమీక్ష చేపట్టారు. ఎబోలా వైరస్ అత్యంత ప్రమాదకర అంటువ్యాధులలో ఒకటిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ వైరస్ సోకిన వ్యక్తుల్లో తీవ్రమైన జ్వరం, వాంతులు, విరేచనాలు, అంతర్గత రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సరైన సమయంలో చికిత్స అందకపోతే మరణాల రేటు అధికంగా ఉండే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సోకిన వ్యక్తి శరీర ద్రవాల ద్వారా వైరస్ ఇతరులకు వ్యాపించే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం ఆఫ్రికాలోని పలు దేశాల్లో ఎబోలా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ దేశాలు అప్రమత్త చర్యలు చేపడుతున్నాయి. డబ్ల్యూహెచ్‌వో హెచ్చరికల నేపథ్యంలో భారత్ కూడా ముందస్తు జాగ్రత్త చర్యలను మరింత కట్టుదిట్టం చేసింది. కోవిడ్ మహమ్మారి అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొన్నాయి. దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా కేంద్రం అప్రమత్త సూచనలు జారీ చేసినట్లు సమాచారం. ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులు సిద్ధంగా ఉంచడం, వైద్య సిబ్బందికి ప్రత్యేక మార్గదర్శకాలు ఇవ్వడం, అనుమానిత కేసులను వెంటనే గుర్తించి నివేదించడం వంటి చర్యలను అమలు చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. ప్రజల్లో అపోహలు వ్యాప్తి చెందకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కూడా కేంద్రం సూచించింది. ఇప్పటి వరకు భారత్‌లో ఎటువంటి ఎబోలా కేసు నమోదు కాలేదని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. అయితే ప్రపంచ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తత కొనసాగుతుందని పేర్కొంది. ప్రజలు అనవసర భయాందోళనలకు గురికాకుండా అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. విదేశాల నుంచి వచ్చిన వ్యక్తుల్లో అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది.

## తెలంగాణలో అతి తీవ్ర వడగాల్పులు.. మొదటిసారి రెడ్‌అలర్ట్ జారీ



హైదరాబాద్:
ఎండల తీవ్రతకు తెలంగాణ నిప్పుల కొలిమిని తలపిస్తోంది. తీవ్ర వడగాల్పులకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరో నాలుగు రోజులపాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. అతి తీవ్ర స్థాయిలో వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంటూ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వడగాల్పులపై మొదటిసారిగా ఈ హెచ్చరిక జారీ అయింది.
అతితీవ్ర వడగాల్పులు వీచే అవకాశమున్న జిల్లాల్లో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం ఉన్నాయి. వీటికి రెడ్ అలర్ట్ జారీ అయింది. మరో 8 జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు వీచే వీలుంది. వీటిలో కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ ఉన్నాయి. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## తిరుపతి ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలో చిరుత కలకలం



తిరుపతి వెలుతురు మే 25

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలోకి చిరుత చొరబడింది. పశువైద్య కళాశాలలోని గర్భకోశ వ్యాధులు, మెడిసిన్ విభాగంలో ఉన్న చిరుతను చూసి ఉద్యోగులు పరుగులు తీశారు. సోమవారం ఉదయం విధులకు హాజరైన ఓ అటెండర్ తాళాలు తీసి శుభ్రం చేస్తుండగా చిరుతను గమనించి పరుగులు తీశారు. వెంటనే అధ్యాపకులకు ఈ విషయం తెలపగా.. వారు ఆ గది వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బంది పెద్దగా శబ్దాలు చేయడంతో అది బాత్రూమ్‌లోకి వెళ్లింది. సిబ్బంది బాత్రూమ్ తలుపులు వేసి అటవీశాఖ, జంతు ప్రదర్శన శాల అధికారులకు సమాచారం ఇచ్చారు. వలలు, బోనుతో ప్రత్యేక బృందాలు అక్కడికి చేరుకున్నాయి. మూడు గంటలపాటు శ్రమించి చిరుతను బంధించి అక్కడి నుంచి తరలించారు. పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో గత నాలుగైదేళ్లుగా మూడు చిరుతలు సంచరిస్తున్నట్లుగా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. గతంలో ఒక చిరుతను బంధించి తరలించగా.. తాజాగా ఈరోజు మరోదాన్ని పట్టుకున్నారు.


## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఏటీఏ ప్రతినిధులు

- **అమెరికాలో జరగనున్న తెలుగు మహాసభలకు ఆహ్వానం**
- **జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు మేరీల్యాండ్‌లో వేడుకలు**
- **సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ**

హైదరాబాద్ వెలుతురు మే 25



హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ను అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ATA) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. అమెరికాలో నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ తెలుగు మహాసభలకు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. 2026 జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు అమెరికాలోని మేరీల్యాండ్‌లో 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రతినిధులు సీఎంకు వివరించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రవాస తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అమెరికన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్ చల్లా, నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల, కాన్ఫరెన్స్ రీజినల్ కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి, ఈశ్వర్ బండా, ప్రవీణ్ పాల్ రెడ్డి పాల్గొన్నారు. తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణలో అమెరికన్ తెలుగు అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి సీఎంకు వివరించారు. ప్రవాస భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక వేడుకలు, సాహిత్య సమావేశాలు, వ్యాపార సదస్సులు, యువత కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com